





నరసరావుపేటలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విరిగిపోయిన కిటికీ తలుపులు, గది తలుపు



మాచర్ల: దుర్గి బీసీ హాస్టల్‌లో చాలీచాలని దుప్పట్లతో సరిపెట్టుకుంటున్న విద్యార్థులు

హాస్టల్లో.. అన్నీ కష్టాలే

తల్లిదండ్రులు, బంధువులు, అయినవారందరికీ దూరంగా ఉంటూ నాలుగక్షరాలు నేర్చుకుందామని సంక్షేమ వసతి గృహాలకు వచ్చిన చిన్నారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక వారు పడుతున్న అగచాట్లకు అంతే లేదు. నాలుగు ముక్కలు నేర్చుకుని ప్రయోజకులవుదామనుకున్న వారికి ఆ భాగ్యం ఎంతవరకూ దుక్కుతుందో ఏమో తెలియదుగానీ, వారు హాస్టళ్లలో నిత్యం పోరాడుతూనే ఉండాల్సి వస్తోంది. వసతి గృహాలకు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. వసతి గృహాల నిర్వహకులు అందినకాడికి అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తున్న దుస్థితి. ఇది ఒక్క సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోనే నెలకొంది. బీసీ సంక్షేమ వసతి గృహాలకు మాత్రం ఇటీవల బిల్లుల బకాయిలు చెల్లింపులు జరిగాయి. ఎస్సీ వసతి గృహాలకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. వసతి గృహాలకు నిధులు విడుదల చేయకుండానే ఖచ్చితంగా మెనూ అమలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఇస్తుండటం గమనార్హం. వసతి గృహాల నిర్వాహక అధికారులు తమ బంగారం కుదువ పెట్టి కూడా అప్పులు తెస్తున్న పరిస్థితి.. ఇదిలా ఉంటే ఫ్యానులు తిరగక, దోమతెరలు లేక పిల్లలు ప్రతి రోజూ దోమలతో యుద్ధం చేయాల్సి వస్తోంది. శీతాకాలం చలితో పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడో విద్యా సంవత్సరం ఆరంభంలో ఇవ్వాల్సిన దుప్పట్లు వారికి ఈరోజు వరకూ అందలేదు. ఇలా అష్టకష్టాలతో విద్యార్థుల హాస్టళ్ల జీవితాలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి.

- భోజన బకాయిలు.. 7 నెలలు
- కాస్మోటిక్ ఛార్జీలకూ దిక్కులేదు
- నోట్ బుక్స్.. సామాగ్రి పంపిణీ లేదాయె
- నాలుగు నెలలైనా అందని దుప్పట్లు
- ఫ్యానులు తిరగక, దోమ తెరలు లేక అగచాట్లు
- చలికాలం వచ్చేస్తున్నా ఇదిగో.. అదిగో అంటున్న అధికారులు
- కనీస వసతులు లేక ఇబ్బందులు
- వెంటాడుతున్న మరుగుదొడ్ల సమస్య

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి పల్నాడు బృందం)

ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత విద్యా సంవత్సరం జనవరి నుంచి బిల్లులు చెల్లించలేదు. ఆ ప్రభుత్వం వసతిగృహాల నిర్వహణను పూర్తిగా గాలికివదిలేసింది. జనవరి, ఫిబ్రవరి బిల్లులు రెండు రోజుల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా నేటివరకు ఒక్క రూపాయి కూడా వసతి గృహాలకు నిధులు విడుదల చేయలేదు. ఏడు నెలలుగా వసతిగృహాల బిల్లులు విడుదల కాలేదు. రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోయాయి. కాస్మోటిక్ ఛార్జీలు సైతం విద్యార్థులకు అందలేదు. చివరకు నోటు పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్లు, ట్రంకు పెట్టె తదితర సామగ్రి ఈ విద్యా సంవత్సరంలో ఒక్కరికి కూడా పంపిణీ చేయలేదు. బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో నిర్వాహక అధికారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. విద్యార్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. బిల్లులు రాక దిక్కుతోచని స్థితిలో హెచ్‌డబ్ల్యూవోలు కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలుచేయలేక నిర్వహణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. భోజన బిల్లులు విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు విద్యార్థుల ఆకలిని తీర్చలేకపోతున్నారు. కాస్మోటిక్ ఛార్జీలు 9 నెలలుగా చెల్లించలేదు.

కాస్మోటిక్ ఛార్జీలకూ దిక్కులేదు

ప్రభుత్వం మాత్రం నెల వారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటివైపు చూడక తప్పడంలేదు. విధిలేక ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతిగృహాలల్లోని విద్యార్థులకు ప్రతినెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3 నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాల్సి ఉంది. 7నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇస్తుంటుంది. బాలురకు రూ.30చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదలచేస్తుంది. ఈ సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు ఇంటికెళ్లి తమ అవసరాల నిమిత్తం డబ్బు తెచ్చు కుంటున్నారు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

కనీసం దుప్పట్లు పంపిణీ లేదాయె

విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామాగ్రిని ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. వసతి గృహాలు తెరిచి రెండు నెలలు గడిచినా నేటి వరకు విద్యార్థులకు ఎటువంటి సామాగ్రి అందజేయలేదని నిర్వహకులు తెలిపారు. ప్రతి విద్యార్థికి నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంగ్ పెట్టె తదితర సామాగ్రిని పంపిణీ చేయాలి. ఇవేవి నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు. వీటిని కూడా పంపిణీ చేయలేదంటే వసతి గృహాల నిర్వహణపై పాలకుల చిత్త శుద్ధిని తెలియజేస్తోంది.

కనీస వసతులకు నిధులు లేవాయే

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు సంబంధితులు వాపోతున్నారు. చివరకు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగు దొడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహర్దశ పడుతుందని ఆయా వర్గాల తల్లి దండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- జిల్లాలోని హాస్టళ్ల పరిస్థితి గమనిస్తే.. నరసరావుపేట పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం పరిస్థితి దయనీయంగా ఉంది. దీనిలో 150మంది విద్యార్థులు ఉంటున్నారు. దోమల నివారణకు గతంలో కిటికీలకు పెట్టిన మెష్‌లు చిరిగిపోయి ఉన్నాయి. అదే విధంగా కిటికీల తలుపులు ఇరిగిపోయి కనిపిస్తున్నాయి, దీంత దొమల బెడద ఎక్కువగా ఉంది. కొంతమంది విద్యార్థులు తెచ్చుకు న్న దోమతెరలో ఇద్దరు ముగ్గురు నిద్రిస్తున్న పరిస్థితి కని పించింది. మరుగుదొడ్లకు లైట్ సౌకర్యం కూడా లేదు. ఇక్కడ పారిశుద్ధ్యం కూడా అధ్వానమే.
- మాచర్ల పట్టణ పరిధిలో ఎస్సీ బాలుర, సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్, బీసీ సంక్షేమ బాలికల హాస్టల్ వసతిగృహాలు ఉన్నాయి. ఈ హస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ జరగలేదు. దుర్గి మండలంలోని బీసీ వసతి గృహంలో 100మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 60 మంది మాత్రమే హాస్టల్లో ఉంటున్నారు. విద్యార్థులకు రాత్రివేళల్లో చలికి తట్టుకోవడానికి ఒక్కో విద్యార్థికి రెండు దుప్పట్లు ఇవ్వాలన్న ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఒక్క దుప్పటి ఇచ్చారు. అయితే వసతి గృహం అద్దెకు నడుస్తున్న రెకుల షెడ్డు కావడంతోపాటు వర్షాలు పడుతుండడంతో విద్యార్థులు చలికి వణుకుతూ అల్లాడిపోతున్నారు. రెంటచింతల మండలలో ఐదు సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ బాలుర హాస్టళ్లలో ఈ ఏడాది ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వలేదు. 150 మంది విద్యార్థులు ఉండగా మరుగుదొడ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కారంపూడి మండల పరిధిలో బీసీ, ఎస్టీ బాలురు, ఎస్టీ బాలికలు, సాంఘిక సంక్షేమ బాలయోగి గురుకుల పాఠశాల హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేయలేదు.
- సత్తెనపల్లి పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో పలు కిటికీలకు అద్దాలు పగిలి పోయి రాత్రి సమయాల్లో విద్యార్థులు చలికి, దోమలకు ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూమ్‌లకు కూడా తలుపులు సక్రమంగా లేవు. బీసీ కళాశాలల బాలుర వసతి గృహంలో కిటికీలకు తలుపులు లేక పోవటంతో దోమ తెరలు కిటికీలకు అడ్డంగా కట్టారు. ఇక్కడ కూడా రాత్రి వేళల్లో చలికి ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద కూడా ఎక్కువగా ఉంది. పట్టణంలోని బీసీ బాలుర, బాలికల ప్రీ మెట్రిక్ వసతిగృహాల విద్యార్థులకు ఒక్కో దుప్పటి పంపిణీ చేశారు. రాజుపాలెంలో బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులకు ఒక్కో దుప్పటి పంపిణీ చేశారు.
- రాజుపాలెం బీసీ హస్టల్లో మొత్తం 8గదులుంటే వాటిలో 4 గదుల్లో ఫ్యాన్లు పనిచేయటం లేదు. వర్షాల సమయంలో గదుల్లోకి నీరు కురుస్తోందని విద్యార్థులు తెలిపారు. కొన్ని కిటికీలకు తలుపులు లేక దోమల బెడద ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. మరుగుదొడ్లకు తలుపులు కూడా లేవని తెలిపారు.
- పిడుగురాళ్లలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టల్స్‌లో విద్యార్థులకు ఈ ఏడాది దుప్పట్లు పంపిణీకి నోచుకోలేదు. సుమారు 70 మందికి పైగా వున్న బీసీ హాస్టల్ గదులకు కిటికీలకు రంధ్రాలు ఏర్పడ్డాయి. అదేవిధంగా దాచేపల్లిలోని ఉన్నత విద్యార్థుల బాలుర వసతిగృహం అద్దెభవనంలో కొనసాగుతుంది. ఇక్కడ 40 మంది విద్యార్థులు వుంటున్నారు. వీరికి కూడా ఈ ఏడాది దుప్పట్లు పంపిణీకి నోచుకోలేదు. ఫ్యాన్లు కూడా సరిగా పనిచేయడం లేదు. మాచవరం మండలంలోని మోర్జంపాడు బాలుర వసతిగృహంలో విద్యార్థులకు దుప్పట్లు ఇంకా పంపిణీ చేయలేదు. వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంటుంది. గురజాలలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు గత ఏడాది పంపిణీ చేసిన దుప్పట్లే వాడుకుంటున్నారు. గురజాల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో అన్నట్లుగా భవనం వుంది. ఇందులోనే బాలికల వసతి గృహం కొనసాగుతున్నా అక్కడ విద్యార్థినులు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతుంటారు.
- పెదకూరపాడు నియోజక వర్గంలోని పలు సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, బీసీ బాలుర వసతిగృహాలు పాక్షికంగా శిథిలావస్థకు చేరాయి. క్రోసూరు మండలంలోని బీసీ బాలుర వసతి గృహంలో కిటికీల తలుపులు విరిగాయి. కొన్ని వాకిళ్ళకు తలుపులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. క్రోసూరు, అచ్చంపేట వసతిగృహాల్లో పైకప్పు పెచ్చులూడి వర్షం కురిసినప్పుడు నీరు కారుతుంది. టాయిలెట్స్‌లకు తలుపులు, నీటి సౌకర్యం లేక విద్యార్థులు బక్కెట్లతో నీరు తీసుకువెళ్తున్నారు. విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ జరగలేదు. బీసీ బాలుర వసతిగృహం అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. క్రోసూరులో మూడు హాస్టల్స్‌కు ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బెల్లంకొండ, అమరావతి మండలాల్లోని వసతిగృహాల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.
- వినుకొండ నియోజకవర్గంలో... ఆ హాస్టల్లో బడితెరిస్తేనే మరుగుదొడ్డి సౌకర్యం. లేనిపక్షంలో కి.మీ. నడిచి చెక్కవాగుకు వెళ్ళాల్సిందే. నరసరావుపేట రోడ్డులోని బీసీ హస్టల్లో కనీసం తాగునీరు, బోరునీరు రాక విద్యార్థులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. నిరుపయోగంగా మారిన మరుగు దొడ్లు కారనంగా 60 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం తాగునీరు లేని పరిస్థితి. బడితెరిస్తేనే లయోలా పాఠశాలలోని బాత్‌రూమ్‌ను వినియోగించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టళ్లలో కనీసం బోరు పనిచేయకపోవడంతో చేతిపంపుపై ఆధారపడాల్సి వస్తోంది. కనీసం తలుపులు, కిటికీలకు రెక్కలు లేకపోవడంతో రాత్రిళ్లు దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిద్ధార్థనగర్‌లోని ఒకే ప్రాంగణంలో ఎస్సీ కళాశాల, ఎస్సీ బాలుర హాస్టల్ కొనసాగుతున్నాయి. మొత్తం రూంలు సగంసగంగా పంచుకుని కాలం గడుపుతున్నారు. 140 మంది విద్యార్థులకు 4 మరుగుదొడ్లే ఉన్నాయి. ఐదేళ్లుగా కాస్మోటిక్ చార్జీలు రాలేదు. పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు ఇవ్వలేదని విద్యార్థులు వాపోతున్నారు.



నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో చిరిగిపోయిన కిటికీ మెస్



పిడుగురాళ్ల బీసీ హాస్టల్లో రంధ్రాలతో వున్న కిటికీలు



అచ్చంపేటలో శ్లాబు పెచ్చులూడి ప్రమాదభరితంగా ఉన్న వసతి గృహం



క్రోసూరులో కిటికీ తలుపులు లేని దృశ్యం



సత్తెనపల్లిలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో కిటికీకి అద్దాలు లేని దృశ్యం



సత్తెనపల్లి ఎస్సీ కళాశాలల బాలికల వసతి గృహం కిటికీ అద్దాలు పగిలిన దృశ్యం



వినుకొండ: నరసరావుపేట రోడ్డులోని బీసీ హాస్టల్లో బోరు లేక చేతిపంపు నీటితో బట్టలు ఉతుకుతున్న విద్యార్థులు



వినుకొండ: బీసీ హాస్టల్‌లో విరిగిపోయిన కిటికీ తలుపులు

సాగు నీటి సంఘాల.. ఎన్నికల నగారా

- ప్రకటన జారీ చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు
- 274 నీటి సంఘాలకు నవంబరు 21న పోలింగ్
- 40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి
- కౌలు రైతులకూ ఓటు హక్కు
- పల్లెల్లో రైతు వర్గాల్లో ఎన్నికల సందడి
- పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీల కసరత్తు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగు నీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు ఇందుకు సంబంధించిన ప్రకటనను సోమవారం విడుదల చేశారు. ఎన్నికల ప్రకటన విడుదలలో జల వనరుల శాఖ ఎస్ఈ, ఎన్నికల అధికారి పి.కృష్ణమోహన్, డీఈఈ నరేంద్ర పాల్గొన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో

(మిగతా 8వ పేజీలో...)



కంప చెట్లతో మూసుకు పోయిన గోవిందాపురం మైనర్ కాలువ

కుడికాలువకు నీటి సరఫరా

- సాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు
- త్వరలోనే కాలువల మరమ్మతులు
- ఎస్ఈ గా బాధ్యతలు చేపట్టిన పి.కృష్ణమోహన్



కృష్ణమోహన్

నరసరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ కుడి కాలువకు నీటి విడుదలను పెంచామని, అల్పపీడన ప్రభావంతో వర్షాల నేపథ్యంలో నీటి సరఫరాను తగ్గించామని, నాగార్జున సాగర్ కుడి కాలువకు 9 వేల క్యూసెక్కులకు నీటి విడుదల చేస్తున్నామని జలవనరుల శాఖ ఎస్ఈ పీ కృష్ణమోహన్ తెలిపారు. ఎస్ఈగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎక్కడా సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నా మన్నారు. కాలువల మరమ్మతులకు రూ 17.69 కోట్లు నిధులు మంజూరయ్యాయని, అత్యవసర పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇప్పటికే చేపట్టాల్సిన 292 పనులను గుర్తించామని, త్వరతగిన వాటిని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పూడికతీత, జమ్ము, కంపచెట్ల తొలగింపు తదితర పనులు ఉన్నాయని, కాలువలకు నీటి సరఫరా చేస్తూనే పనులు చేపడతామని అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రానున్న 40 రోజుల్లో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు నిర్వహణకు జలవనరుల శాఖలోని అధికారులను నియమించాం. రైతుల సహకారంతో ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో కొంత మేరకు ఉద్యోగుల కొరత ఉందని, ఆయా పోస్టుల్లో ఖాళీలను భర్తీ చేయాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను కోరనున్నట్లు కృష్ణమోహన్ తెలిపారు.

పోలీసుల త్యాగం వెలకట్టలేనిది

- ఘనంగా పోలీసు అమర వీరుల దినోత్సవం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దుల్లో సైనికులు, దేశంలోని పోలీసులు నిరంతరం కృషి వలనే ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారన్నారని, వారి ప్రాణత్యాగం వెల కట్టలేనిదని ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, అరవిందబాబు కొనియాడారు. నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు మునిసిపల్ క్రీడా ప్రాంగణంలో సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ పోలీసు అమర వీరుల స్థూపానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావులు మాట్లాడుతూ పోలీసుల త్యాగ స్ఫూర్తి భావి తరాలకు ఆదర్శమని కొనియాడారు. కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ సమాజానికి పోలీసులు చేసిన సేవలు అనిర్వచనీయం అన్నారు. పోలీసు వ్యవస్థ లేని సమాజాన్ని ఊహించ లేమన్నారు. సమాజ హితం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆ మహావీరుల త్యాగాన్ని స్మరించు కోవటం మనకెంతో గర్వకారణం అన్నారు. పోలీసు శాఖ ప్రజలకు, సమాజానికి మరిన్ని సేవలను అందిస్తుందని కోరుకుంటున్నానన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా ఎంతో మంది సైనికులు, పోలీసులు సంఘ విద్రోహ శక్తులను ఎదుర్కొనే క్రమంలో ప్రాణ త్యాగం చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో 26 మంది పోలీసులు వీరమరణం పొందారన్నారు. వీరందరికీ మనస్ఫూర్తిగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నానన్నారు. భవిష్యత్‌లో పోలీసు శాఖ సమాజానికి, ప్రజలకు మరిన్ని సేవలు అందించటానికి కృషి చేస్తామని జిల్లా పోలీసుల తరుపున తెలుపుతున్నానన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా వ్యాప్తంగా వీర మరణం పొందిన ఒక ఎస్ఐ, ఎనిమిది మంది పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ ఘనోరే, పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్, డీఎస్పీ నాగేశ్వరరావు, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు డాక్టర్ అరవిందబాబు, పుల్లారావు, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు



ఆన్‌లైన్ విచారణకు చొక్కా లేకుండా వచ్చిన వ్యక్తి

- హైకోర్టు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

తుళ్లూరు, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) ఒంటిపై చొక్కాలేకుండా ఓ వ్యక్తి ఆన్‌లైన్ విచారణలోకి రావడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ నెల 15న హైకోర్టులో కేసుల విచారణ జరుగుతుండగా కోర్టు నంబర్. 17లో కిట్టు అనే ఓ వ్యక్తి లాగిన్ అయ్యాడు. ఒంటిపై చొక్కా లేకుండా మంచంపై పడుకొని మాట్లాడుతూ కేసు విచారణకు ఆటంకం కలిగించాడని తుళ్లూరు ఎస్సై అంకమ్మరావు తెలిపారు. ఈ వ్యవహారంపై హైకోర్టు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 267, 292. ఐటీ చట్టం సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి



చిల్లరగా నాణేల్ని చేస్తున్న బ్యాంకు అధికారులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, అవి రోజు వారి లావాదేవీలకు వినియోగించుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ ఎస్.కె. కిరణ్ రెడ్డి తెలిపారు. సోమవారం లక్ష్మీపురం బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామందిలో పది రూపాయల నాణెం చెల్లదన్న అపోహ ఉందనీ, దానిని తొలగించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రూ.60 వేలకుగానూ చిల్లరగా రూ.10 నాణేలను వినియోగదారులకు అందజేశారు. బ్యాంకు సిబ్బంది కె.వెంకటరమణరావు, ప్రసన్నా, శ్రీనివాసరావు, అశ్వత్ నారాయణ, ఖాతాదారులు సంజీవరెడ్డి, వి.కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ అమర వీరులకు నివాళి

పెదకాకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అధికారులు ఘనంగా నిర్వహించారు. అమర వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. విజయవాడ జోన్ ఎస్పీఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకర్రావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది చేసే త్యాగాలు మరువలేనివని అన్నారు.

చంద్రబాబు ముందుచూపుతోనే భారీగా గ్రాంట్లు

- బీజేపీతో పొత్తుపై పెదవి విరుపునకు ఇదే సమాధానం
- రూ. 15 వేల కోట్లతో మహానగరంగా అమరావతి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'బీజేపీతో పొత్తు పెట్టుకోవడంలోనే చంద్రబాబు ముందుచూపు, దార్శనికత కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తుపై చాలా మంది పెదవి విరిచారు. కానీ అధినేత చంద్రబాబు పొత్తుకే మొగ్గు చూపారు. ఆ ముందు చూపుతోనే అతి తక్కువ సమయంలో, అద్భుత రీతిలో గ్రాంట్లు రాబట్టగలిగాం. అమరావతి నిర్మాణం కోసం ఇస్తున్న రూ.15వేల కోట్లతో అక్కడ ఒక మహానగరం ఆవిష్కృతమవబోతోంది. అమరావతికి నాడు ప్రాణం పోసిన చంద్రబాబు, ఇప్పుడు ఆ అమరావతిని మహా నగరంగా రూపొందించబోతున్నారు. అదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనత' అంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సీఎం చంద్రబాబు దార్శనికతను కొనియాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు సోమవారం వెళ్లిన ఆయనకు ఘన స్వాగతం లభించింది. నాలుగు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలో అద్భుత రీతిలో గ్రాంట్లు రాబట్టగలిగామన్నారు. కొందరు దాన్ని అప్పు అంటున్నారని, ఎవరైనా చదువుకున్న వాళ్లు ఉంటే చూడండి, ఇది అప్పో, గ్రాంటో తెలుస్తుంది అని ఆయన స్పష్టత ఇచ్చారు. రూ.15 వేల కోట్ల నిధులతో ఒక మహానగరం ఇక్కడ రాబోతుందన్నారు. రూ.25 వేల కోట్లకు పైగా నిధులతో రైల్వే లైన్లను కేంద్ర ప్రభుత్వం ఆధునికీకరణ చేస్తుందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేసే కృషి రాబోయే తరాలకు అద్భుతమైన భవిష్యత్తును అందించబోతోందన్నారు. సీఎం చంద్రబాబు నాడు ఒక విజన్‌తో ఆలోచన చేశారంటే, అది ప్రజాభివృద్ధి కోసమే తప్ప మరేమీ కాదని ఎన్నికల ముందే చెప్పామని గుర్తు చేశారు. వినుకొండ మీదుగా నాలుగు లైన్ల జాతీయ రహదారిని వినుకొండ, తాడికొండ మీదుగా అమరావతిలో కలపబోతున్నామన్నారు. ఐదేళ్లుగా ఆగిపోయిన వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నిరంతరం కృషి చేసి ప్రత్తిపాడుకు తిరిగి తీసుకువస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా ఎవరి వల్లా కాని గుంటూరు శంకర్ విలాస్ వంతెనను సాధించామన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండి జగన్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగు నెలల్లోని చంద్రబాబు, లోకేశ్ నేతృత్వంలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి కనిపించకుండా చేశామన్నారు. గుంటూరు ఛానల్, గుంటూరు డ్రెయిన్, నల్లమడ డ్రెయిన్ సమస్యలకు కూడా త్వరలోనే పరిష్కారం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాబోయే 40 ఏళ్లకు సరిపడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

పనిమనిషిగా చేరి... రూ.37 లక్షల సొత్తు చోరీ

- ఓ వైద్యురాలి ఇంట్లో కిలాడీ లేడి భాగోతం
- దశల వారీగా బంగారు నగలు, నగదు అపహరణ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ వైద్యురాలి ఇంట్లో పనిమనిషిగా చేరి.. నమ్మకస్తురాలిగా నటించి అదను చూచి అందిన కాడికి దోచుకున్న కిలాడీ లేడీ భాగోతాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు బట్టబయలు చేశారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ వివరాలను వెల్లడించారు. చెంగపు వెంకట రమణ అనే మహిళ మంగళగిరి బైపాస్ రోడ్డులోని మిడ్‌వ్యాలీ సిటీ సముదాయంలో ఓ వైద్యురాలి వద్ద నాలుగు నెలల క్రితం పనిమనిషిగా చేరింది. అత్యంత నమ్మకస్తురాలిగా నటిస్తూ దశల వారీగా వైద్యురాలి నివాసంలో చోరీలకు పాల్పడింది. తన సమీప బంధువు అయిన వేముల వెంకన్న సహకారంతో బంగారు నగలు, నగదు, ఖరీదైన సెల్‌ఫోన్లు, మోటారు బైకును అపహరించింది. అయితే, ఇటీవల డైమండ్ నల్లపూసల గొలుసు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన వైద్యురాలు ఈ నెల 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మంగళగిరి రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, క్లూస్ టీం నివేదికల ఆధారంగా పనిమనిషి వెంకట రమణ ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. ఆత్మకూరు పరిధిలోని సీకే కన్వెన్షన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం నిందితులైన వెంకట రమణ, వెంకన్నలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి సుమారు 300 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, రూ.11 లక్షల 9 వేల నగదు, రూ.లక్షన్నర విలువ చేసే యమహా ఆర్-15 బైకు, రూ.లక్ష విలువ చేసే శాంసంగ్ మొబైల్, రూ.90 వేల విలువ చేసే ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం దాదాపు రూ.37 లక్షలు వుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

కరవు రహిత రాష్ట్రంగా మార్చాలని కోరుకున్నా



చిలువూరులో పూజలు నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

దుగ్గిరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రానున్న ఐదేళ్లలో కరవురహిత రాష్ట్రంగా మార్చాలని గంగానమ్మదేవతను కోరుకున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండల గ్రామం చిలువూరులో మూడ్రోజులుగా జరుగుతున్న గంగానమ్మ దేవత దేవస్థానం 12వ వార్షిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి నిమ్మల మంగళవారం పాల్గొన్నారు. జగదీష్‌బాబు, రమేష్‌బాబు సోదరులు, అర్చకులు అంజనీకుమార్‌తో కలిసి మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ, బయోఫర్ సీఈఓ డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు ఆహ్వానం మేరకు వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో యువ నాయకుడు నారా లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతగా జలవనరులశాఖ నుంచి అన్నివిధాల తొలిప్రాధాన్యత ఇచ్చి, ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తానన్నారు. డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సోదరుడు గంగాశ్రీ డాక్టర్ రమేష్‌బాబు మంత్రి నిమ్మలను దుశ్శాలువాతో సత్కరించారు. రంగిశెట్టి జగదీష్‌బాబు, సుభాషిణి దంపతులు అమ్మవారికి అలంకరించేందుకుగానూ 108 చీరెలను సమర్పించారు. తెనాలికి చెందిన చిన్నారి కంతేటి గగనశ్రీ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను, అమ్మవారి భక్తిపాటలకు కూచిపూడి నృత్యాభినయం చేసి ఆకట్టుకుంది. ఉత్సవాల అనంతరం వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తోటకూర సీతారామయ్య, మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, సాదిక్, బిట్బూ, కల్కి, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, యడ్ల సాయికృష్ణ, కేసంనేని వాసుబాబు, విశ్రాంత ఐఆర్ఎస్ ఉద్యోగి రంగిశెట్టి మంగబాబు, సింగులూరి వీరన్న, జ్యోతి, గద్దె శ్రీనివాస్, మండవ మౌళయ్య, ఆలపాటి శ్రీనివాసరావు, జలాలుద్దీన్, దేవభక్తుని రంగప్రసాద్ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు ప్రహరీ నిర్మాణం



నరసరావుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉద్యానవనంలో కూల్చి వేసిన ప్రహరీని నిర్మించారు. గోడను కూల్చి వేసిన టీడీపీ నాయకుడే తిరిగి నిర్మించాడు. పార్కులో ప్రహరీతో పాటు కళావేదిక కూల్చివేతపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. కూల్చివేతలకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒకటో పట్టణం పోలీసు స్టేషన్‌లో కమిషనర్ జస్వంత్ ఫిర్యాదు చేశారు. సమచారం తెలుసుకున్న సదరు వ్యక్తి సోమవారం ప్రహరీ నిర్మించారు. అయితే కూల్చివేసిన కళావేదికను కూడా సదరు వ్యక్తే నిర్మించాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తుళ్లూరు, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) వెంకటపాలెం వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డుపై ప్రమాదం సోమవారం సంభవించింది. ఈ ఘటనలో విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన పలగాని రాము(42)మృతి చెందాడు. మృతి చెందిన రాము సెంట్రింగ్ పనులు చేస్తూ ఉంటాడు. రాయపూడి గ్రామంలో పనులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా, మారుతి షిఫ్ట్ ఏపీ 39 డబ్ల్యూ 9832 కారు వేగంగా వచ్చి రాము బైకును ఢీకొట్టింది. అతను అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడున్నాడు. తుళ్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అండర్ - 14 ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ - 14 ఫుట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు బాలుర విభాగం నుంచి 170, బాలికల విభాగం నుంచి 90 మంది క్రీడాకారులు హాజరైనట్లు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగభైరు సురేష్ కుమార్ తెలిపారు. జట్లను ఎంపిక చేశామని, ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఆయన తెలియ జేశారు. జిల్లా బాలుర జట్టుకు సాయి చరణ్, వై.గోపీచంద్, కె.చిరంజీవి, పి.చరణ్, వై.విజయ రాఘవరెడ్డి, జాన్ అఫ్రాన్, ఎం.మనోహర్, సీహెచ్ హర్షవర్ధన్, గౌరీ శంకర్, భాను, సంజయ్, ఎం. హనీష్, ఎం. సంజయ్, వి.నిఖిల్, తేజ సాయి, షేక్ మహమ్మద్ సైఫుల్లా, సాండ్ బైలుగా క్రాంతి వర్ధన్, అఫ్రాన్, హరినాథ్ ఎంపికయ్యారు. జిల్లా బాలికల జట్టుకు లక్ష్మీప్రసన్న, ఆర్. చైత్రశ్రీ, జి.పుష్పలత, పి.అక్షయ, స్వప్న, దివ్యశ్రీ, శ్రీవల్లి, అలేఖ్య, సీహెచ్ అభీర, జి.చిన్మయి, టి. త్రివేణి, పి.ప్రవల్లిక, ఎస్. రుచిత, ఎం జాహ్నవి, జి.అను, షేక్ సమీర, శ్రీలక్ష్మి, స్టాండ్ బైలుగా త్రివేణి, మంజుల, వై శిరీషాలు ఎంపికయ్యారు. ఎంపికల ప్రక్రియలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సీహెచ్ వినయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, అనీల్ దత్త నాయక్, కాకుమాను సునీత, జాలా శిరీష, రియాజ్, షేక్ పెద కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

గాదెవారిపాలెంలో టీడీపీ, జనసేన వర్గాల బాహాబాహీ



ఘర్షణలో గాయపడిన వారు

క్రోసూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలం గాదెవారిపాలెంలో మురుగు కాలువలకు పూడికతీసే విషయంలో ఘర్షణ చెలరేగి టీడీపీ, జనసేన వర్గాల వారు బాహాబాహీకి దిగారు. ఈ సంఘటనలో రెండు వర్గాలకు చెందిన ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీకి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే గాదెవారిపాలెంలో మురుగు కాలువలను శుభ్ర పరిచే కాంట్రాక్టును జనసేన వారికి అప్పగించారు. ఈ క్రమంలో టీడీపీ వారు తాము కూడా పనులు నిర్వహిస్తామని రంగంలోకి దిగటంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాల వారు కర్రలు, పెట్రోల్ సీసాలు, రాడ్లతో ఘర్షనకు దిగారు. రెండు వర్గాలకు చెందిన గాదె సూరయ్య, అంకిపల్లి వేణుగోపాల్, అంకిపల్లి విశ్వేశ్వరరావు, చిమటా వెంకటేశ్వర్లు, చిమటా శ్రీకాంత్, యాదల గంగా పాల్, పిడుగు నాగేశ్వరరావు, కృష్ణవేణి గాయపడ్డారు. టీడీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గాదె సూరయ్యకు తల భాగంలో ఎనిమిది కుట్లు, అంకిపల్లి వేణుగోపాల్‌కు కంటి భాగంలో 15 కుట్లు, చిమటా వెంకటేశ్వర్లుకు ఆరుకుట్లు పడ్డాయి. కృష్ణవేణి అనే మహిళకు తలకు బలమైన గాయమైంది. విషయం తెలిసిన వెంటనే సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, పెదకూరపాడు సీఐ సురేష్, క్రోసూరు ఎస్ఐ నాగేంద్రబాబు హుటాహుటీన పోలీసు బలగాలతో గ్రామానికి చేరుకున్నారు. టీడీపీకి చెందిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయటంతో పాటు తమకు చెందిన ఎరువుల దిబ్బలను తొలగించారని, కేవలం జనసేన వారి ప్రాంతాల్లో మాత్రమే మురుగు కాలువల పనులు నిర్వహిస్తున్నారని, ఇదేమని అడిగినందుకు తమ పై దాడులు చేసి కొట్టారని టీడీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గాదె సూరయ్య అన్నారు. గ్రామ సభలు, పల్లె పండుగ ద్వారా గుర్తించిన పనులను గ్రామంలో జనసేనకు చెందిన కొంతమంది నిర్వహించటానికి పూనుకున్నారని, వారిలో కొంతమంది టీడీపీ వారు కూడా ఉన్నారని నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రామకృష్ణ అన్నారు.

టీడీపీ వారిపై దాడి

ముప్పాళ్ళ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తొండపిలో ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బోరుపోతు నాగేశ్వరరావు పశువుల షెడ్డును నిర్మించుకునేందుకు రోడ్డుపై ఇసుక, మట్టి వేశాడు. దానిని ఇంటిలోకి మోస్తుండగా, ఎదురుగా ఉండే చింతిరాల అశోక్, సుధీర్‌లు నాగేశ్వరరావుతో ఒక్కడివే చేస్తున్నావు ఎన్నిరోజులు చేస్తావు అంటూ పాత కక్షలను మనసులో పెట్టుకుని ఆదివారం సాయంత్రం గొడవ పెట్టుకున్నారు. తిరిగి మద్యం తాగి సుధీర్, అశోక్‌లతో పాటు మరికొంతమంది కలిసి రాత్రివేళ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులపై కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడి చేశారు. దాడిలో నాగేశ్వరరావు సోదరులు యోబు, భిక్షాలుకు గాయాలైయ్యాయి. సత్తెనపల్లిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

కలసికట్టుగా ఎదుర్కొందాం!

- యాంటీ బయోటిక్ విచ్చలవిడి వాడకం వద్దు
- నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు
- డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఏడీ లక్ష్మణ్ వెల్లడి

ఫటా ఫట్



గుంటూరు మెడికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి పెనుసవాల్‌గా మారుతున్న ఔషధ నిరోధకత సమస్యను (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్) ఔషధ వ్యాపారులతోపాటు పౌర సమాజం కలసికట్టుగా ఎదుర్కోవాలని ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. నగరంపాలెంలోని ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఔషధ నిరోధకత సమస్యను ఎదుర్కొనేందుకు శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. అవసరం ఉన్నా, లేకున్నా విచ్చలవిడిగా యాంటీ బయోటిక్ మందులను వాడటం ప్రమాదకరమని హెచ్చరించారు. దీనివల్ల బ్యాక్టీరియాలు ఆ మందును తట్టుకునే శక్తిని సంతరించుకుంటాయని, ఫలితంగా మందులు తమ ప్రభావం కోల్పోతాయని తెలిపారు. దీని కారణంగా చిన్న జబ్బులు కూడా దీర్ఘకాలం వేధిస్తాయన్నారు. ప్రజలు కూడా యాంటీ బయోటిక్ మందులను సొంత నిర్ణయంతో వాడవద్దని ఆయన కోరారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్ మందులు విక్రయించవద్దని రిటైల్ మందుల దుకాణదారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఏడీ లక్ష్మణ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ మందుల దుకాణాలకు అవసరం లేకున్నా యాంటీ బయోటిక్ మందులు భారీగా డంప్ చేయడం తగ్గించుకోవాలని టోకు ఔషధ వ్యాపారులను ఆదేశించినట్లు చెప్పారు.

వ్యాపారుల్లో పెరుగుతున్న అవగాహన

కొంతకాలంగా తమ శాఖ తీసుకుంటున్న చర్యల ఫలితంగా రిటైల్ ఔషధ వ్యాపార వర్గాల్లో యాంటీ బయోటిక్ మందుల విక్రయాలపై నియంత్రణ జరుగుతోందని అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ తెలిపారు. గతంలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా యాంటీ బయోటిక్ మందులు విక్రయించిన పలు దుకాణాల లైసెన్స్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో గుంటూరులోని పది రిటైల్ మందుల దుకాణాలపై తనిఖీ చేయగా, అన్ని చోట్ల చీటీలు లేకుండా యాంటీ బయోటిక్‌లు విక్రయించలేదని చెప్పారు. ఔషధ నియంత్రణ శాఖ చేపట్టిన చర్యలతో సెఫ్ట్రియాక్జోన్ ఇంజెక్షన్లు, సెఫిక్జిమ్ ట్యాబ్లెట్ల విక్రయాలు పూర్తి నియంత్రణలోకి వచ్చినట్లు చెప్పారు. వీటి విచ్చలవిడి అమ్మకాలను పూర్తిగా తగ్గించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ హెచ్1 కేటగిరిలో విక్రయించే మందులకు సంబంధించి ఔషధ దుకాణదారులు తప్పనిసరిగా ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, లేకుంటే శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధిలో పోటీ పడుతున్న తెలుగు రాష్ట్రాలు

- తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



యలమంచిలి శివాజీని సత్కరిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తెలుగు రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు, బృందావన్‌గార్డెన్స్‌లోని మాజీ ఎంపీ యలమంచిలి శివాజీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు ఉన్నాయని అన్నారు. దీంతో ఉమ్మడి ప్రణాళికలను రూపొందించి మెరుగైన ఫలితాలు సాధిస్తామని తెలిపారు. పోలవరం నిర్మాణ సందర్భంగా ఏపీలో విలీనమైన ఏడు మండలాలు తిరిగి అడగడం లేదని, కేవలం ఏడు గ్రామాలనే అడుగుతున్నామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తిగా ఏపీ భూభాగంలో ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు తెలంగాణ ఎటువంటి అభ్యంతరాలు చెప్పలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపు వల్ల తెలంగాణకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. బ్యాక్ వాటర్ వల్ల వరద వచ్చినప్పుడు భారీగా ముంపు వస్తుంది అన్నారు. భద్రాచలం పట్టణం ఎగువన ఉన్న గ్రామాలను మాత్రమే తెలంగాణలో కలపాలని కోరుతున్నామన్నారు. టీటీడీలో వాటా అడగలేదని సిఫార్సులు లేఖలు ఇస్తే అనుమతి ఇచ్చారని, కానీ వైసీపీ ప్రభుత్వం టీటీడీపై నిబంధనలు పెట్టిందని గుర్తుచేశారు. తెలంగాణలో పామాయిల్ సాగు విపరీతంగా ఉందని, అమ్మకాల విషయంలో కూడా ముందంజలో ఉందన్నారు. ఏపీలో కూడా ఉత్తరాంధ్రాలో ఈ సాగును చేస్తున్నారని వివరించారు.

అధిక బరువుతో వాహనాలను తిప్పకుండా సహకరించాలి

మేడికొండూరు అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి అధిక బరువుతో టిప్పర్లను రహదారులపై తిప్పవద్దని రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి (డీటీసీ) సూచించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'టిప్పర్లు రోడ్డు ఎక్కాలంటే ముడుపులు చెల్లించాల్సిందే' అనే కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రకటన విడుదల చేశారు. మోటారు వాహన చట్టం ప్రకారం అనుమతించిన వాహన బరువుకు మించి అధికలోడుతో వాహనములు ప్రయాణించడాన్ని నిషేధించామని, అనుమతించిన బరువుకు ఐదుశాతం వరకు మార్జిన్ ఇస్తున్నట్లు తెలిపారు. అంతకుమించిన బరువుతో వాహనములు రహదారులలో ప్రయాణించినట్లయితే మోటారు వాహన చట్టం ప్రకారం రూ.20 వేలతో పాటు అదనంగా ప్రతి టన్నుకు రూ. 2వేల వంతున అపరాధ రుసుము విధిస్తామని పేర్కొన్నారు. గత రెండు నెలల్లో అధిక బరువుతో తిరుగుతున్న వాహనాలను గుర్తించి వారిపై 23 కేసులను నమోదు చేయటంతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. రహదారి భద్రత దృష్టిలో ఉంచుకొని అధిక బరువుతో తిరుగుతున్న వాహనాల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున టిప్పర్ల యజమానులు ఈ విషయాన్ని గుర్తించి అధిక బరువుతో వాహనాలను వినియోగించకుండా ప్రభుత్వానికి, రవాణా శాఖ వారికి సహకరించాలని కోరారు. త్వరలో లారీ ఓనర్స్ అసోసియేషన్ వారితో సమావేశం నిర్వహించి అధిక బరువుతో వాహనాలను తిరగకుండా అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

తేమ శాతం ఎక్కువగా ఉంటే పత్తి కొనలేం

- సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి

గుంటూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయలేమని జనరల్ మేనేజర్ పి అమర్నాథ్ రెడ్డి అన్నారు. గుంటూరులోని సీసీఐ ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సీసీఐ కేంద్రాలు తెరిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే 8 నుంచి 12 శాతం మేరకు మాత్రమే తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు ఉన్నాయని అన్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో కూడా పత్తిలో ప్రస్తుతం 13 నుంచి 14 శాతం తేమ ఉన్నట్లుగా తేలిందని అన్నారు. ఏకధాటిగా వర్షాలు కురవడం వల్ల పత్తిలో తేమ ఎక్కువగా ఉంటుందని అన్నారు. పత్తిలో మైక్రో నేయర్ 5 శాతం వరకు ఉన్నా ధర తగ్గింపుతో కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. సెంటర్ ఇన్‌చార్జిలు ప్రతిరోజు పత్తిలో ఉన్న తేమను యంత్రాల ద్వారా కొలుస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 33 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఉందని అన్నారు.ఆయా కేంద్రాలకు సంబంధించి 90 మిల్లుల కి పైగా టెండర్లు దాఖలు చేశాయని అన్నారు. అయితే 31 కేంద్రాలకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే ఖరారు చేశామని చెప్పారు. మిగిలిన రెండు సెంటర్ల వివరాలు కూడా కేంద్రానికి పంపామన్నారు. గుంటూరు జిల్లాలో 5, పల్నాడులో 7, బాపట్లలో 2, ఎన్టీఆర్ జిల్లాలో 6, ఏలూరులో 1, కాకినాడలో 1, పార్వతీపురంలో 1, కర్నూలులో 4, నంద్యాలలో 1, అనంతపురంలో 2, కడపలో 1 చొప్పున సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

ఎమ్మెల్సీ ఓటు కోసం 167 దరఖాస్తులు

ముప్పాళ్ళ అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ళ మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు కోసం ఆన్‌లైన్‌లో 167 దరఖాస్తులువచ్చాయని ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాసుత చేసుకోవాల్సిన పట్టభద్రులు ఇంకా ఎవరైనా ఉంటే నవంబరు 6వ తేదిలోపు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చూసించారు.

జోన్ డైరీ

● మాచవరం మండలంలోని గంగిరెడ్డి పాలెం, శ్రీ రుక్మిణీపురం గ్రామాల్లో గతంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ పనుల రికార్డులు పరిశీలించేందుకు గానూ మంగళవారం కేంద్ర బృంద సభ్యులు పర్యటించనున్నారు.

● నకరికల్లు మండలంలో మంగళవారం నుంచి ఈనెల 25 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నారు. 22,23 తేదీల్లో నకరికల్లులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో, 24,25 తేదీల్లో ఇందిరమ్మ కాలనీలో, 22, 23, 24, 25 తేదీల్లో గుండ్లపల్లిలో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి.

● నకరికల్లు మండలంలో గ్రామసభలు నిర్వహించనున్నారు. 22వతేది మంగళవారం చేజర్ల, 23వ తేదీ చీమలమర్రి, 24న చల్లగుండ్ల గ్రామాల్లోని సచివాల యాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల గ్రామ సభలు నిర్వహించనున్నారు. రైతులు భూ రీ సర్వే సమస్యలపై ఆయా సభల్లో అధికారులకు లిఖిత పూర్వకంగా అర్జీలను అందజేయవచ్చు.

● మాచవరం మండలంలోని తురక పాలెం, మోర్జంపాడు, ఆకురాజుపల్లి, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో మంగళవారం నుంచి ఆధార్ సేవలను ప్రారంభిభం కానున్నాయి. అలాగే రాజుపాలెం మండలంలోని మొక్కపాడు, నెమలిపురి, రెడ్డిగూడెం, అనుపాలెం, గణపవరం సచివాలయాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

శనగ విత్తనాలు పంపిణీ

దుర్గి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లె రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను పంపణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ యేచూరీ సునీతా శంకర్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అమీర్‌రెడ్డి, సిబ్బంది కల్యాణ్‌నాయక్, కూటమి నేతలు ఉన్నం మహేష్, మనుగోటి పార్వతయ్య, పత్తిపాటి శివరామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అన్నదానం

సత్తెనపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పరివర్తన పాఠశాలలో సోమవారం పోలీసు అమర వీరుల వారోత్సవాన్ని నిర్వహించారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అమీనుద్దీన్‌లు పోలీసు అమర వీరుల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసులతో కలసి అమర వీరులకు నివాళులర్పించారు.

భూ సమస్యలపై
అర్జీలు అందజేయండి

మాచవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మీ గ్రామంలో రీ సర్వే జరిగినప్పటికీ ఇంకా ఏమైనా భూ సమస్యలు ఉండి ఉంటే అర్జీల రూపంలో తెలియ జేయాలని తహసీల్దార్ క్షమారాణి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని మోర్జంపాడు గ్రామంలో రెవెన్యూ సమస్యలపై గ్రామ సభ నిర్వహిం చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాల్మన్ రాజు, టీడీపీ నేతలు గడిపూడి సైదయ్య, దున్నా చెన్నయ్య చౌదరి, రమణా రెడ్డి, చందాల శివ, నరేంద్ర, పాపయ్య, పంచాయతీ కార్యదర్శి ఖాన్, వీఆర్‌వోలు రైతులు పాల్గొన్నారు.





తెగిపోయిన వాగు గట్టు, మేట వేసిన పొలం (ఫైల్)

వరదొస్తే వణుకే..

మండల పరిధిలో అధిక వర్షాలు కురిసి వరద వచ్చిందంటే ప్రజలు, రైతులు వణికిపోతున్నారు. తుఫానులు వచ్చినప్పుడు వాగులు, వంకలు, చెరువులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టించిన రైతుకు కన్నీరే మిగులుతోంది. వరద నీటిలో పంట కొట్టుకుపోవడం, ఇసుక మేటలు వేయటంతో దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశించినా నిరాశే మిగులుతోంది.

- ● అధిక వర్షాలకు పొంగుతున్న వాగులు
- ● మేటలు వేసి దెబ్బతింటున్న పైరులు
- ● మళ్లీ సాగుచేయాలంటే పెరుగుతున్న ఖర్చులు
- ● తీవ్రంగా నష్టపోతున్న రైతులు

వెల్దుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):

తుఫాన్‌లు సంబవించినప్పుడు మండలంలో ప్రధానంగా పట్లవీడు వాగు, చెరువు, రచ్చమలపాడు వాగు, ఉప్పలపాడు ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. వీటి ఉధృతికి సమీపంలోని పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కొన్నిచోట్ల వాగు కట్టలు తెగిపోయి పైర్లు తుడిచి పెట్టుకుపోతున్నాయి. మండాది, రచ్చమలపాడు మధ్యలోని వాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు గట్లు తెగిపోవడంతో వరదనీరు పంటలను ముంచెత్తింది.



పత్తిలో కలుపు చేరడంతో జీవాల మేతకు వదిలేసిన దృశ్యం

దీంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు. వరదల సమయంలో ఈవాగుల్లో నీటి ఉధృతికి సుమారు 150 ఎకరాల వరకు పైర్లు దెబ్బతిన్నాయి. అలాగే పట్లవీడు వాగు సమీపంలోని పొలాలదీ ఇదే పరిస్థితి. ఎకరానికి రూ. 30 వేలు పెట్టుబడి పెట్టి మిరప సాగు చేపట్టగా ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపుగా పంటలన్నీ దెబ్బతిన్నాయి. ఉప్పలపాడు సమీపంలోని ఎర్రవాగు ఉధృతికి ఇదే పరిస్థితి నెలకొంది. పట్లవీడు చెరువు నిండుకుండను తల పించడంతో సమీపంలోని పంట పొలాల్లోకి నీరు చేరి పైర్లు ఉరకలెత్తి ఎండిపోయాయి.

పెరుగుతున్న పెట్టుబడులు

మొదటిసారి వేసిన మిర్చి సాగుకి ఎకరానికి రూ. 30 వేలు దాకా ఖర్చవుతుండగా పత్తి, కంది, ఇతర పంటలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చయింది. అయితే ఇటీవల భారీవర్షాలకు ఏర్పడిన నష్టాన్ని పూడ్చుకునేందుకు రైతులు మళ్లీ మిర్చితో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుకి మొగ్గు చూపుతున్నారు. కొన్ని పొలాల్లో ఇసుక మేటలు వేసి ఉండడంతో జేసీబీతో చదునుచేసుకున్నారు. కొన్నిచోట్ల పొలాల్లో వర్షం పదును ఆరకపోవడంతో అలాగే వదిలేశారు. దీంతో పొలంలో పంటతో పాటు కలుపు పెరిగి అడవిని తలపిస్తోంది. పత్తి చేలల్లో రెండు రోజులు నీరు నిలవడంతో పూత, పిందె రాలిపోవడంతో జీవాల మేత కోసం పంటను వది లేశారు. ప్రతి ఏటా ఇలానే జరుగుతోందని, వాగుల కట్టలు పటిష్ట పరిస్తే వరదలు వచ్చినప్పుడు కొంత నష్టా లను నివారించ వచ్చని రైతులు చెబుతున్నారు.

ఎకరానికి రూ. 40 వేలు నష్టం

- అయ్యప్పరెడ్డి, రైతు, మండాది



నేను రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేశా. వరద వచ్చి వాగు కట్టలు తెగిపోయి పొలాన్ని నీరు ముంచెత్తడంతో మొక్కలన్నీ కొట్టుకు పోయాయి. పొలంలో ఇసుక మేటలు వేసింది. జేసీబీతో దానిని చదునుచేశాను. సుమారు రూ. 40 వేల దాకా నష్టం వాటిల్లింది.

మూడెకరాల పైరు తుడిచిపెట్టుకుపోయింది

- కోనుగంటి శ్రీను, రైతు, పట్లవీడు



మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేపట్టా. భారీ వర్షాలకు వాగులు పొంగటంతో పైరు తుడిచిపెట్టుకుపోయింది. పొలాన్ని బాగుచేసి మళ్లీ మిర్చి వేశా రూ. లక్ష దాకా నష్టం వాటిల్లింది.

చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించండి

- ● అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ప్రవీణ్
- ● క్రోసూరులో ప్రజాదర్బార్
- ● రైతుల నుంచి వెల్లువెత్తిన ఫిర్యాదులు

క్రోసూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సంబంధిత సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం క్రోసూరు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో అధికంగా భూములకు సంబంధించిన సమస్యలు మాత్రమే తమకు అధికంగా వస్తున్నాయని, వాటి పరిష్కారం విషయంలో చిన్న పొరపాటు జరిగినా రైతులు తరతరాలుగా ఇబ్బందులకు గురవుతారని, జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అధికారులెవ్వరూ ఎక్కడా, ఏవిషయంలోనూ అవినీతికి పాల్పడవద్దని, రైతులని ఇబ్బంది పెట్టొద్దని, వారితో మర్యాదగా మెలగాలని అన్నారు. మ్యాన్యువల్ రికార్డులైన అడంగల్, పహణి, 1బీ రిజిస్టర్‌లను తప్పనిసరిగా వీఆర్‌వోలు, తహసీల్దార్లు తమ వద్ద ఉంచు కోవాలని, రైతుల సమస్య ఆన్‌లైన్‌లో పరిష్కారం కానప్పుడు మ్యాన్యువల్ రికార్డు చూసి పరిష్కరించాల్సి ఉంటుందన్నారు.



ఎమ్మెల్యే ప్రవీణ్‌కు సమస్యలను విన్నవిస్తున్న ప్రజలు

ఆన్‌లైన్‌లో పొరపాట్లు జరిగాయంటే దానికి కారణం రెవెన్యూ అధికారులే అవుతారని, రైతుల నుంచి ఏ పొరపాట్లు జరగవన్నారు. అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఆ నివేదికను తనకు వాట్సప్‌లో పంపించాలన్నారు. ప్రజాదర్బార్‌లో మొత్తం 173 ఫిర్యాదులను ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రజల నుంచి స్వీకరించారు. వాటిలో అధిక భాగంగా రెవెన్యూ, పోలీసు, విద్యుత్‌శాఖలకు సంబంధించినవే ఉన్నాయి. అత్యధికంగా 83 సమస్యలు రెవెన్యూ శాఖకు, 73 సమస్యలు అభివృద్ధి కార్యక్రమాలకు చెందినవి ఉన్నాయి. కార్యక్రమంలో తహల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు, సీఐ సురేష్, ఎస్ఐ నాగేంద్రబాబు, విద్యుత్ ఏఈ బసవరాజు, వ్యవసాయాధికారి వేణుగోపాల్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డయేరియా లక్షణాలతో వృద్ధురాలి మృతి

కారంపూడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగార్లపాడులో వాసాల మహాలక్ష్మమ్మ (70) అనే వృద్ధురాలు డయేరియా లక్షణాలతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. చినగార్లపాడులో గత కొన్ని రోజులుగా జ్వరాలు విజృంభిస్తుండగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నా స్పందన లేదు. ఈ గ్రామం పిడుగురాళ్ల మండలం కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉంది. అలాగే గ్రామానికి చెందిన బత్తుల వీర్ల వెంకయ్య డయేరియా లక్షణాలతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు పిడుగురాళ్లలోని ఆస్పత్రికి తరలించారు. అలాగే చల్లా శివనాగును నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇప్పటికైనా వైద్యాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలపాటిని గెలిపించాలి

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు పట్ట భద్రులుగా ఓటు నమోదు చేసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి సోమవారం ఫణిదం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రభుత్వ పాఠశాలల్లో పట్టభద్రులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న కూటమి ప్రభుత్వం తరుపున ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబడిన మాజీ మంత్రి డాక్టర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నిమ్మగడ్డ సుబ్బారావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు నిమ్మగడ్డ పూర్ణయ్య, టీడీపీ నేతలు నిమ్మగడ్డ సురేష్, నిమ్మగడ్డ అర్జునరావు, కోట ఖాళిదాసు, పల్లా కోటేశ్వరరావు, మదమంచి నాగ గోపీ, షేక్ ఆదం షఫీ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటుని నమోదు కావాలని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబరు 6 లోపు అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై దృష్టి సారించాలి

- ● చైర్మన్ పదవిపై నేతలు ఏకాభిప్రాయానికి రావాలి
- ● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



రెంటచింతల,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఓటు నమోదుపై టీడీపీ శ్రేణులు దృష్టి సారించాలని, మాజీ మంత్రి ఆలపాటి రాజాను ఎమ్మెల్సీగా భారీమెజార్టీతో గెలిపించుకుందామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం రెంటచింతలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1994 నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆలపాటి రాజాకు పాలనాపరంగా విశేష అనుభవం ఉందన్నారు. రాష్ట్రంలో సాంకేతిక కళాశాల ఏర్పాటులో మంత్రిగా ఎంతో చొరవ తీసుకుని గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేశారన్నారు. గత ఎన్నికల్లో రెంటచింతల మండలం నుంచి 780 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లున్నారని, అయితే ఇప్పుడు ఆఫ్‌లైన్ ద్వారా కేవలం తొమ్మిది దరఖాస్తులు రావడంపై ఒకింత అసహనం వ్యక్తం చేస్తూనే, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సంఖ్యపై ఆరా తీశారు. నవంబరు 6 దరఖాస్తు గడువు కాగా, పార్టీ శ్రేణులు పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయటం కోసం గ్రామాల్లో మైక్ ప్రచారం చేయాలని శ్రేణులకు సూచించారు. సత్రశాల ట్రస్టు బోర్డు చైర్మన్ అభ్యర్థి ఎంపిక వ్యవహారంలో నేతలతే తుది నిర్ణయమని, నవంబరు 2 నుంచి కార్తీకమాసం రాబోతుందని, నోటిఫికేషన్ రావడం ఆలస్యమైతే తొలుత తాత్కాలిక చైర్మన్‌ను ఎంపికచేసి కార్యక్రమాలను నిర్వహిద్దామని నేతలకు సూచించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఎం శౌరిరెడ్డి, రాయపరెడ్డి, సిద్ధయ్య తదితరులు ఉన్నారు.



కూటమి నేతలు, ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడుతున్న సాయినిఖిల్

పట్టభద్రుల ఓటు నమోదు చేయండి

పిడుగురాళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణ-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటు నమోదుకు ప్రతి పాఠశాల, కళాశాలలోని అర్హులైన వారిని గుర్తించి నమోదు చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కుమారుడు నిఖిల్ తెలిపారు. ఆది, సోమవారాలలో పిడుగురాళ్లలో పలువురు కూటమినేతలు, పాఠశాలలు, కళాశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయ సంఘ నేతలతో సమావేశం నిర్వహించిన నిఖిల్ పట్టభద్రులైన వారు ప్రతిఒక్కరు ఓటు నమోదు చేయించుకునే విధంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు.

మార్నింగ్ వాక్‌లో చిరు వ్యాపారులతో..

జానపాడు రోడ్డులో మార్నింగ్ విత్ వాక్ కార్యక్రమంలో భాగంగా యరపతినేని సాయి నిఖిల్ పలువురి వ్యాపారులు, ప్రజలతో ముచ్చటించారు. టీ స్టాల్‌లో టీ తాగుతూ వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి సోదరి నసీమూన్ మృతిచెందగా నిఖిల్ వారి కుటుంబాన్ని పరామర్శించారు.

న్యాయవాదుల ప్రచారం

సత్తెనపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి 2025లో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం టీడీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు మద్దినేని వెంకట చలపతిరావు, న్యాయవాదులు పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రచారం నిర్వహించారు. అర్హులైన వారంతా ఓటర్లుగా నమోదు కావాలని న్యాయవాదులకు దరఖాస్తు ఫారాలు అందించారు. కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, పూదోట రాజు తదితరులు ఉన్నారు.

టెయిల్‌పాండ్‌కు పోటెత్తుతున్న వరద

రెంటచింతల,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు 11 క్రస్ట్ గేట్లను 3 మీటర్లు, 3 గేట్లు 4 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 2,36,813 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని, విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేశామని ఈఈ సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువన సాగర్ నుంచి వస్తున్న నీటిని వస్తున్నట్లుగానే విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.25 మీటర్ల మేర నీరుండగా, అది 6.909 టీఎంసీలకు సమానమని ఈఈ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట,అక్టోబరు 21: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ నుంచి 1,83,190 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుందని, 1,83,190 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. వీటిలో 16 వేల క్యూసెక్కులు పవర్ జనరేషన్ ద్వారా, 7 గేట్ల నుంచి కృష్ణానదికి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసు అమర వీరులకు
ఘన నివాళులు

పెదకూరపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పెదకూరపాడులో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి కచేరి సెంటర్, పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీ సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడి పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ గిరిబాబు, పోలీసు సిబ్బంది, అభినందన, కాకతీయ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేస్తున్న టీడీపీ నేతలు

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

రెంటచింతల,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రెంటచింతలకు చెందిన బోయిన లక్ష్మమ్మకు సోమవారం స్థానిక టీడీపీ నేతలు రూ.76,372 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేశారు. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ఆనారోగ్యానికి గురై, అధిక ఖర్చుతో కూడిన శస్త్రచికిత్సలు అవసరమైనప్పుడు తగిన ఆర్థికసాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కి దరఖాస్తు చేసుకోవ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి, బోడపాటి రామకృష్ణ, మొండెద్దుశౌరిరెడ్డి, మూలి రాయపరెడ్డి, ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై
రైతులకు అవగాహన

బెల్లంకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):స్థానిక రైతు సేవా కేంద్రంలో వరిసాగు రైతులకు సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఏవో కృష్ణయ్య తెలిపారు. రైతు సేవా కేంద్ర సిబ్బందిని కలసి ఎలుకల నిర్మూలన విషపు ఎర తయారు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

ఎరువుల కొనుగోలు
రసీదులు తప్పక తీసుకోండి

దాచేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎరువుల దుకాణాలలో కొనుగోలు చేసిన ఎరువులు, క్రిమి సంహారక మందులకు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని పిడుగురాళ్ల వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. సోమవారం దాచేపల్లిలో ఎరువుల దుకాణాల డీలర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో కొనుగోలు చేసిన పురుగు మందులు, ఎరువులకు బిల్లులు తీసుకోవడం ద్వారా ఎంతో ఉపయోగం వుంటుంన్నారు. గడువు ముగిసిన, కల్తీ మందులను విక్రయించినా, అలాగే నిర్ణయించిన ధరకంటే అధిక రేటుకి అమ్మినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని షాపుల నిర్వాహ కులను హెచ్చరించారు. పురుగు మందుల వివరాలు రైతులకు తెలిసేలా బోర్డుపై నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో దాచేపల్లి మండల ఏవో పాపకుమారి, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

భూమి కబ్జాపై ఫిర్యాదు

ముప్పాళ్ళ అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమకు పూర్వీకుల ద్వారా వచ్చిన భూమిని కబ్జా చేసేందుకు చూస్తున్నారని షేక్ ఖాశింసాహెబ్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. 1955లో తన తాత పెద్దసాహెబ్ కొనుగోలు చేసిన భూమిని సత్తెనపల్లిలో రిజిస్ట్రేషన్ చేయించారని, తర్వాత 1964లో తన తండ్రి చిన్న సాహెబ్, మోదిన్‌సాహెబ్ పార్టీషన్ చేయించుకున్నారన్నారు. అనంతరం ఆ భూమిని కౌలుకు ఇచ్చి తాము కండ్లకుంట వెళ్లగా చుట్టుప్రక్కలవారు ఆక్రమించారన్నారు. తమ భూమి రికార్డులను పరిశీలించి ఆక్రమణదారుల చెర నుంచి భూమిని విడిపించి తమకు అప్పగించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్టుకు మోడల్ స్కూల్ విద్యార్థిని

నకరికల్లు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అండర్ - 18 విభాగంలో దేచవరం మోడల్‌స్కూల్ విద్యార్థిని కనుమూరి బుజ్జి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కే.వెళాంగిని మేరి, ఫిజికల్ డైరెక్టర్ బత్తిని వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె మన రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

పెదకూరపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటిబండ్ల ఆర్‌సీఎం హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. 92 మందికి పరీక్షలు నిర్వహించగా నలుగురికి దృష్టిలోపం ఉన్నట్లు ఆప్తాల్మిక్ అధికారి పీవీడీ శివ సుబ్బారావు గుర్తించారు.కార్యక్రమంలో సిస్టర్ విజయకుమారి, నూర్జహాన్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలివ్వాలి

పెదకూరపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి కౌలురైతులకు పెట్టుబడి సాయంగా అందించే రూ.20 వేలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ రైతుసంఘం నేతలు సోమవారం తహసీల్దార్ డానియేలుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి దర్శి శేషారావు, రైతులు పలువురు పాల్గొన్నారు.

20 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

మాచర్ల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తడంతో ప్రాజెక్ట్ అధికారులు సోమవారం 20 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 20 గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 1,59,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నీటి మట్టం 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9047 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 25,100, 20 క్రస్ట్‌గేట్ల ద్వారా 1,59,900, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 400, మొత్తం అవుట్‌ఫ్లో 2,02,420 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,02,420 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

గొడవలు పడొద్దు

- ● పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్
- ● ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న టీడీపీ - జనసేన శ్రేణులకు పరామర్శ

సత్తెనపల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన కార్యకర్తలు ఏ విషయంలోనూ గొడవలు పడొద్దని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. శనివారం రాత్రి గాదెవారిపాలెంలో టీడీపీ, జనసేన వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలను ఆయన పరామర్శించారు. ఘర్షణ జరగటానికి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త యర్రంశెట్టి రామకృష్ణానే కారణమని, నాగవరం నుంచి వైసీపీకి చెందిన కొందరిని కలుపుకొని దాడికి పాల్పడ్డాడని క్రోసూరు మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సూరయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. అయితే ఎమ్మెల్యే ప్రవీణ్ వెంట యర్రంశెట్టి రావటంతో టీడీపీ శ్రేణులు కోపోద్రిక్తులయ్యారు. ఎమ్మెల్యే ప్రవీణ్ వారికి సర్ది చెప్పారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావుకు ఎమ్మెల్యే సూచించారు. ఈ ఘర్షణపై టీడీపీ, జనసేన నేతలు ఒకరికొకరు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నేతలు తోక వెంకటరావు, నల్లమేకల వెంకటేశ్వర్లు, నలజాల సద, గుడిపూడి సైదా తదితరులు ఉన్నారు.



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అల ద్వారకాపురిలో..



ద్వారకాపురిలోని శిథిల దేవాలయం



చేనేత వస్త్రాలకు రంగులు వేసే ప్రాచీన అద్దకపు యూనిట్



బుగ్గవాగు రిజర్వాయర్ ముంపునకు గురై శిథిలావస్థకు చేరిన పురాతన బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయం

- కనుమరుగైన ప్రాచీన నగరం
- ఎనిమిది శతాబ్దాల క్రితం పట్టణ విధ్వంసం
- నేటికీ పురావస్తుశాఖ దృష్టికి రాని వైనం

ఆ నగరం పేరు ద్వారకాపురి.. 12వ శతాబ్దంలో దాని వైభవం అంతా ఇంతా కాదు.. ఒకవైపు సిరి సంపదలతో తులతూగుతుండగా.. మరోవైపు సంగీత, సాహిత్య శిల్పకళలకు కాణాచిగా నిలిచిందని తమ పూర్వీకులు చెప్పే వారని స్థానికులు చెబుతున్నారు. అయితే రాచరిక వ్యవస్థలో స్వర్ణయుగం చవిచూసిన ఆ పట్టణం రాత్రికి రాత్రే నేలమట్టమైంది.. పట్టణ ప్రజలంతా తెల్లారేసరికి నిర్జీవులయ్యారు.. ఎక్కడ చూసినా శవాల గుట్టలే.. బతికి బట్టకట్టిన వారు చెట్టుకొకరు.. పుట్టకొకరు.. ఈ ఘోర విపత్తుకు కారణం అర్ధరాత్రి శత్రుమూకల దాడో.. భూకంప ప్రళయమో.. కబళించిన కలరా మహమ్మారో తెలీదు.. కారణం ఏదైతేనేం నాగరికతతో విలసిల్లిన ఈ పట్టణం ఒక్క రాత్రిలోనే కాలగర్భంలో కలిసి చరిత్ర నుంచి అదృశ్యమైందని అక్కడి పెద్దలు కథలు కథలుగా చెబుతారు. దుర్గి మండలం ధర్మవరం పరిధిలో శిథిలావస్థలో దర్శనమిస్తూ నాటి చారిత్రక ఆనవాళ్లను ఇంకా దాచుకున్న ద్వారకాపురి వృత్తాంతం తెలుసుకోవాలంటే అక్కడకు వెళ్లాల్సిందే..

మాచర్లటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ద్వారకాపురి పట్టణం సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో సగభాగం బుగ్గవాగు రిజర్వాయర్‌లో మునిగిపోగా, మిగిలిన సగభాగం వ్యవసాయ భూమిగా మారింది. వ్యవసాయ భూమిలో ఎక్కడ చూసినా పగిలిపోయిన కుండ పెంకులు, గాజుముక్కలు కనిపిస్తుంటాయి. అంగుళానికి ఈ కుండపెంకులు విస్తరించి కనిపిస్తున్నాయి. రైతులు దుక్కి దున్నుతున్నప్పుడు మట్టికుండలు, పిడతలు పైకి రావడం సర్వసాధారణం. పొలం గట్లపై పలు దేవతామూర్తుల విగ్రహాలు పడి దర్శనమిస్తాయి. వీటిలో నాగదేవత, వినాయకుడు, గజలక్ష్మి, ఏనుగును అధిరోహించిన వీరవనిత తదితర విగ్రహాలు ఉన్నాయి. చేనేత వస్త్రాలకు రంగులు తయారుచేసే ఒక యూనిట్ ఈనాటికీ శిథిలావస్థలో అక్కడ దర్శనమిస్తుంది. ఈ ప్రాంతంలో కొంతభాగాన్ని నాగులకట్ట, మరికొంత భాగాన్ని కుమ్మరిగుట్ట అని పిలుస్తుంటారు. ఈ భూములను సాగు చేస్తున్న రైతులకు తరచూ బంగారు నాణాలు, ఆభరణాలు ఇప్పటికీ లభిస్తున్నాయి. ఇక్కడ నాలుగు శిథిలయాలు కూడా ఉన్నాయి. ఈ ఊరికి పక్కన నిరంతరం నీరు ప్రవహించే బుగ్గవాగు ఉండగా, వాగుకు ఆవలవైపు బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం మెట్లకు దిగువభాగాన పాతాళగంగా నిరంతరం భూమిపైకి పొంగుతూ ఉంటుంది. ఆ నీరు ఆనాటి ద్వారకాపురి పట్టణ వాసుల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేది. 1964లో నిర్మించిన బుగ్గవాగు రిజర్వాయర్ వల్ల బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు భూమిపైకి ఉబికి వచ్చే పాతళగంగ కూడా మునిగి ఉనికి కోల్పోయ్యాయి.



ప్రతి అంగుళానికి దర్శనమిచ్చే కుండపెంకులు



పొలం గట్లపై దీనావస్థలో ఉన్న శిలా విగ్రహాలు

ద్వారకాపురి విధ్వంసం ఇలా జరిగిందట..

శిథిల ఆలయం ముందు కనిపిస్తున్న శిలాశాసనంలో ఓరుగల్లు రాజుల ప్రసక్తి ఉంది. దీన్ని బట్టి 12వ శతాబ్దంలో ఈ పట్టణం విలసిల్లినట్లు ఊహించవచ్చు. వైభవ ప్రాభవాన్ని అనుభవించిన ఆ పట్టణం ఎందుకు శిథిలస్థితికి చేరిందో ఇప్పటికీ అర్థం కాదు. ఆనాటి ముస్లిం రాజుల దండయాత్ర వల్లనో.. లేక ప్రకృతి వైపరీత్యాల కారణంగానో ద్వారకాపురి విధ్వంసానికి గురై ఉండవచ్చు. అయితే స్థానికులు మరో కథనం చెబుతుంటారు. శ్రీశైలం అడవుల్లో నివసించే చెంచు తెగల దాడి వల్లనే ఈ పట్టణం ధ్వంసమైందని ఈప్రాంత వాసులు విశ్వసిస్తున్నారు. వారి కథనం ప్రకారం.. చెంచు తెగకు చెందిన ఓ మహిళ తేనె అమ్మడానికి తన కుక్కతో ఈ పట్టణానికి వచ్చింది. ఓ ఇంట్లో తేనె విక్రయిస్తుండగా ఆ తిరుగుతున్న పిల్లిని చూసి ఆ కుక్క దానిపై దాడి చేసి చంపింది. ఈ విషయమై ఆ చెంచు మహిళకు, ఆ కుటుంబసభ్యులకు ఘర్షణ జరిగి చివరకు ఆ తేనే అమ్ముకునే మహిళ హత్యకు దారితీసింది. ఆమె హత్య విషయం తెలుసుకున్న చెంచులు ప్రతీకార జ్వాల రగిలించింది. రాత్రికి రాత్రే ద్వారకాపురి పట్టణంపై దాడి చేసి మగవారి గొంతుకులు కోశారని, ఈ దాడితో పట్టణం శవాల గుట్టలతో శ్మశానంగా మారిందని. మగ దిక్కు కోల్పోయిన మహిళలంతా పట్టణం వీడిపోగా, తప్పించుకున్న మగవారు కొన్నాళ్లకు తిరిగివచ్చారు. వారిలో కొందరు ధర్మవరంలో అంతర్భాగంగా ఉన్న దారివేముల గ్రామాన్ని ఏర్పరుచుకోగా, కొందరు దుర్గి ప్రాంతానికి వచ్చి నేటి దుర్గి గ్రామాన్ని నిర్మించుకున్నారు.

పురావస్తు శాఖ దృష్టికి రాని నాటి ద్వారకాపురి చరిత్ర

చరిత్ర నుంచి అదృశ్యమైన నాటి ద్వారకాపురి చరిత్ర నేటికీ పురావస్తు శాఖ దృష్టికి రాలేదు. అపురూప శిల్పసంపద, శిలాశాసనాలు, చారిత్రక అవశేషాలకు నిలయమైన ద్వారకాపురి ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి నిలువటద్దంలా నిలిచి ఉంది

ఘనంగా కశ్మీర్ యువ సమ్మేళనం

పెదకాకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ,



గుంటూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నేటి నుంచి 6 రోజుల పా టు జరిగే 4వ కశ్మీర్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమం డాక్టర్ వేణుగోపాలరెడ్డి సెమినార్ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కశ్మీర్‌లోని ఆరు జిల్లాలైన పుల్వామా, బుడ్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ నుంచి మొత్తం 132 మంది యువతి, యువకులు హాజరయ్యారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన నెహ్రూ యువకేంద్రాల్లో గత మూడేళ్లుగా జరుగుతుందన్నారు. కశ్మీర్ యువ సమ్మేళనం కార్యక్రమం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, కశ్మీర్ యువకులలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తుందన్నారు. అలాగే కశ్మీర్ యువతకు ఇక్కడి సంస్కృతి, సంప్రదా యాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అల వాట్లు సహా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు యువ సమ్మేళనంలో వివరిస్తారని అన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ దేశంలో యువ త ఎక్కువగా ఉన్నారని, జాతీయ ఐక్యత, సమ గ్రత, శాంతి ప్రతిపాదకులుగా వ్యవహరించేలా అవగాహన కల్పించడం, అలాగే దేశంలోని సాంస్కృతిక, పారిశ్రామిక, చారిత్రక, పర్యాటక విద్యా పరమైన ప్రముఖ ప్రదేశాలను సందర్శిం చేందుకు అవకాశం యువ సమ్మేళనం వలన కలుగుతుం దని తెలిపారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లా డుతూ వివిధ అంశాలపై రెండు రోజుల క్షేత్రస్థాయి సందర్శన ఉందనీ, ప్రతి శాఖ సహ కారంతో నిర్వహిస్తున్నామని అన్నారు. యూని వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహచలం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి, ఓఎస్ డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్, డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి, నెహ్రూ యువ కేంద్ర వైజాగ్ జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు గౌరవ అతిథులుగా హా జరై ప్రసంగించారు. కార్యక్రమంలో కశ్మీర్ యువత సాంస్కృతిక ప్రదర్శనతో సందడి చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు

సమస్యలపై ఆశా వర్కర్ల మెరుపు ధర్నా

- ఏపీఐఐసీ భవనం వద్ద బైఠాయించి నిరసన

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు సోమవారం మంగళగిరిలో మెరుపు ధర్నా నిర్వహించారు. తొలుత చినకాకాని ఎన్నారై ఆసుపత్రి వద్ద నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ అనిల్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలో ఆశా వర్కర్లు ముఖ్యభూమిక పోషిస్తున్నారని చెప్పారు. ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి ఫలితం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు వారి పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.6 వేలు కూడా నేటికీ ఇవ్వలేదన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రాజకీయ నేతలు, అధికారుల వేధింపులు మానుకోవాలని, అనుభవం కలిగిన ఆశా వర్కర్లకు తగిన శిక్షణ ఇచ్చి ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, మెడికల్ ఉద్యోగులకు వర్తించే అన్ని సదుపాయాలను కల్పించాలని, డీఎంహెచ్‌వో సంతకంతో కూడిన గుర్తింపు కార్డులను జారీ చేయాలని, రూ.పది లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి, ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి, రాష్ట్ర ఇన్‌ఛార్జి ఎస్.వెంకట సుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ఎస్.వెంకటేశ్వరరావు, గోపాల్, అమ్ములు, నాగమణి, చంద్రశేఖర్, చందా షైర్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ భవనం వద్ద బైఠాయించి నిరసన చేస్తున్న ఆశా వర్కర్లు

సాగు నీటి సంఘాల.. ఎన్నికల నగారా

(5వ పేజీ తరువాయి)

274 సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 274లో 55 సంఘాలు మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ సారి కౌలు రైతులకు ఓటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాగు నీటి సంఘాలకు ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆ తర్వాత సంఘాలు ఏర్పాటయ్యాయి. చివరిసారిగా 2015లో ఎన్నికలు జరిగాయి. 2020తో కాలపరిమితి ముగిసింది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణను విస్మరించింది. దీంతో సాగు నీటి కాలువల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం లేకుండా చేసింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే సాగు నీటి సరఫరా.. కాలువ మరమ్మతుల్లో అవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఐదేళ్లు నిర్వీర్యమైన సాగు నీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. జనవనరులలో రైతులను భాగస్వాములను చేస్తోంది. నీటి పంపిణీలో రైతులకు కీలక పాత్ర కల్పించనుంది.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక సంఘాలను గుర్తించి వీటిలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలకు రైతుల ఓటర్ల లిస్టుల తయారీ బాధ్యతలను రెవిన్యూ శాఖకు అప్పగించారు. నీటి సంఘాల పరిధిని ఇప్పటికే జలవనరుల శాఖ గుర్తించింది. మైనర్ ఇరిగేషన్ అంటే చెరువుల కింద సాగు చేస్తున్న ఆయకట్టు రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను సంబంధిత శాఖ సేకరించింది. ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో ఆయకట్టు ఆధారంగా రైతులకు ఓటు హక్కును కల్పిస్తారు. ఇందుకు సంబంధించి ఆయకట్టు పరిధిలో సర్వే నెంబర్లు సేకరించారు. ఏ సర్వే నెంబర్‌లో ఎంత మంది రైతులు ఉన్నారు, వీరిలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో నిర్ధారిస్తారు. ఈ వివరాలు అధారంగా సాగు నీటి సంఘం పరిధిలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జలవనరుల, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా ఓటర్లను గుర్తిస్తాయి.

ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగనుంది. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తికానుంది. ఎన్నికల ప్రక్రియను జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా ఇందులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. 21న ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం 40 రోజుల్లో ముగియ నుంది. ఈసారి కౌలు రైతులకు ఓటు హక్కును కల్పిస్తున్నారు. నీటి సంఘాల పరిధిలో టీసీలను 31న ప్రకటించను న్నారు. వీటిపై అభ్యంతరాలను 1 నుంచి స్వీకరిస్తారు. 3న టీసీల తుది జాబితాను విడుదల చేస్తారు. 3న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. 6న భూ యజమానుల జాబితా(ఓటర్ల)ను రూపొందించే ప్రక్రియ ప్రారంభమై 10న ముగుస్తుంది. 11, 12 తేదీల్లో ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, 13నఅభ్యంతరాల పరిష్కా రం, ఓటర్ల తుది జాబితాలను ప్రకటిస్తారు. 20న నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూ యూఏ) నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. 21న డబ్ల్యూయూఏలకు ఎన్నికలు నిర్వహిస్తారు. 21 నుంచి 23 తేదీలలోపే సంఘాల సభ్యులు, అధ్యక్షు డు, ఉపాధ్యక్షుడి ఎన్నికలను పూర్తి చేస్తారు. 24 నుంచి 26 తేదీలలో నీటి పంపిణీ సంఘాలు (డీసీ)లు, 27 నుంచి 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ(పీసీ) కార్యవర్గ ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది.

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు.. రైతుల్లో సంతోషం

సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. 2003లో తొలిసారిగా సాగునీటి వినియో గదారుల

భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటేనే ఓటరు

సాగు నీటి సంఘాలకు ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సాగునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగు నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. రుణ అర్హత కార్డులు పొందిన కౌలు రైతులకు ఓటు హక్కు కల్పిస్తున్నారు. డబ్ల్యూయూఏకు కమిటీలను టీసీ సభ్యులు ఎన్నుకుంటారు. ఈ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. డీసీల నుంచి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.

దృష్టి సారించిన ప్రధాన పార్టీలు

సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరగనున్న తొలి ఎన్నికలపై పార్టీలు దృష్టి సారించాయి. రైతుల వర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు నేతలు సమాయత్తమయ్యారు.

కంపచెట్లతో నిండిపోయిన పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్



సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏఎన్‌యూ భారీ విరాళం

- ఉద్యోగుల వితరణపై చంద్రబాబు అభినందన



సీఎం చంద్రబాబుకు విరాళాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, వర్సిటీ వీసీ ఆచార్య కే గంగాధరరావు, అధికారులు

పెదకాకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) ఉద్యోగులు భారీ విరాళం రూ.18,22,106ను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి అందజేశారు. పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహా చలం, వర్సిటీ అధికారులు సీఎంను కలిశారు. ఉద్యోగులు అందించిన విరాళంపై సంతోషం వ్యక్తం చేసిన సీఎం, ఉద్యోగులను అభినందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ఉద్యోగుల ప్రథమ కర్తవ్యంగా భావించి సహకారం అందించడం హర్ష ణీయమని అన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని వర్సిటీ అధికారులకు సూచించారు. వర్సిటీ అభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తనవంతు సహకారం అందిస్తుందని అన్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విజయవాడలో సంభవించిన వరదల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేకమైన చర్యలు అభినందనీయమని ప్రశంసించారు. ఆచార్య వి. రవికుమార్, ఆచార్య ఎం.సుబ్బారావు, ఆచార్య జి.రత్నాకర్, డాక్టర్ జి.అనిత, డాక్టర్ ఎ వి వి ఎస్ స్వామీ, డాక్టర్ గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజ్ బాధిత మిర్చి రైతులకు న్యాయం

- కేంద్ర మంత్రి పెమ్మసాని చొరవపై రైతుల హర్షం

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర శివారులోని నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర, తియ్యగూర కోల్డ్‌స్టోరేజ్‌లలో రైతులు కమీషన్ వ్యాపారి ద్వారా వాటిల్లో నిల్వ ఉంచడం, ఆయా కోల్డ్ స్టోరేజ్‌లను అనధికారికంగా సబ్‌లీజుకు తీసుకున్న వ్యక్తి, రైతుల మిర్చిని వారికి తెలియకుండానే విక్రయించడం, నకిలీ బాండ్లు సృష్టించి బ్యాంకుల్లో పెట్టి రుణాలు కూడా తీసుకున్న విషయం గత 20 రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 32 మంది రైతులకు రూ. 1.60 కోట్లు చెల్లించాల్సి రావడంతో కమీషన్ వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యజమాని వద్ద వసూలు చేయించారు. రైతుల మిర్చికి క్వింటాల్‌కు రూ. 13 వేల చొప్పున లెక్క కట్టి సోమవారం నగదు విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ పేదలు, రైతుల బల హీనతలను అడ్డు పెట్టుకొని మోసం చేస్తే వాళ్ల ఎంతటి వారైనా వదిలిపెట్టబోమన్నారు. రైతుల్లో కొందరు ఒక వ్యాపారి వద్ద నగదు తీసుకొని సరుకుని వేరొక వ్యాపారికి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో రైతులు కూడా ధర్మబద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే రామాంజనేయులు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరీ ఐ వెంకటేశ్వరరెడ్డి, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దాదాపు రూ. 1.60 కోట్లను చెక్కుల రూపంలో అందజేయించడంతో గుంటూరు, పల్నాడు, కర్నూలు, ప్రకాశం జిల్లాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోల్డ్‌స్టోరేజ్ బాధిత రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని

రేపు 'డయల్ యువర్ డీఎం'

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23వ తేదీ బుధవారం చిలకలూరిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం జరుగుతుందని డిపో మేనేజర్ ఎస్.రాంబాబు తెలియజేశారు. డిపో పరిధిలో చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండల ప్రజలు ఈ ప్రోగ్రాంలో పాల్గొని సూచనలు, సలహాలు, ఫిర్యాదులు తెలియజేయాలని కోరారు. 9959225427 నెంబరుకు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్ చేయాలన్నారు.

క్రైమ్ జోన్

కళాశాల బస్సు ఢీకొని ఒకరు మృతి

రొంపిచర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని కళాశాల బస్సు ఢీకొన్న సంఘటనలో ఆరేపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కూలి సోమవారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన బత్తుల శివ(42) గ్రామంలో పనులు ముగించుకొని నరసరావుపేట వెళ్తుండగా నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు బుచ్చిపాపన్నపాలెం వద్ద ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ అశోక్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బస్సు డ్రైవర్ రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతునికి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు రహదారిపై ధర్నాకు దిగారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్ తెలిపారు.

జిల్లా యువకుడు ఏర్పేడులో మృతి

వినుకొండ టౌన్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన గాలి మణికంఠ (29) చిత్తూరు జిల్లా గాజుల మాడ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏర్పేడులో సోమవారం మృతి చెందాడు. మణికంఠ కొంతకాలంగా గ్రామస్థులతో కలిసి తాపీపనులకు వెళ్లాడు. సోమవారం డాబాపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడడంతో మృతి చెందినట్లు సమాచారం. 40సంవత్సరాల క్రితం మృతుడి తండ్రి నాగేశ్వరరావు గ్రామం విడిచి వెళ్లారని గ్రామస్థులు తెలిపారు.

ఆర్బీకేల్లో ఎరువులు పంపిణీ చేయాలి

రొంపిచర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు సోమవారం వినతిపత్రాన్ని తహసీల్దార్ బండి నిర్మలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో యూరియా మినహాయించి మిగిలిన ఎరువులు, పురుగు మందులు ఇవ్వటం లేదన్నారు. కార్యక్రమంలో రొడ్డా అంజిరెడ్డి, పిడెం హుస్సేన్, మధు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో ఎన్ఈసీకి ప్రథమ స్థానం

నరసరావుపేట కల్చరల్, అక్టోబర్,21. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీలలో జరిగిన అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలలో నరసరావుపేట ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.సునీల్ సోమవారం తెలిపారు. కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న ఎస్.ధనుష్, ఎ.నాగేంద్ర, పి.బాలసతీష్, ఆర్ ఆదిత్య చరణ్‌లు విజేతలుగా నిలిచిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరి రమేష్‌బాబు, వ్యాయమ అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు

యడ్లపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజోతి): రెవెన్యూ సదస్సులలో భాగంగా మండలంలోని మైదవోలు, లింగారావుపాలెం గ్రామాలలో అధికారులు సోమవారం గ్రామసభలను నిర్వహించారు. తహసీల్దార్ విజయశ్రీ, డీటీ అనూరాధ, మండల సర్వేయర్ సురేంద్రబాబు, వీఆర్వోలు గ్రామసభలకు హాజరై ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. మ్యుటేషన్, సర్వే తదితరాలకు సంబంధించి 26 దరఖాస్తులు రాగా లింగారావుపాలెంలో 33 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ అనూరాధ, మండల సర్వేయర్ సురేంద్రబాబు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల వేతనాలపై సమగ్ర దర్యాప్తు చేయాలి: గంగయ్య

శావల్యాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం చేసిన పనులకు ఉపాధి హామీ కూలీలకు ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదని స్థానిక అధికారులతో పాటు గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య ఆరోపించారు. నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఇదే విషయంపై కలెక్టర్‌కు మరోసారి ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ, పంచాయతీలో జరిగిన అక్రమాలపై సెప్టెంబరు 30న గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని, విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా స్థానిక అధికారులు స్పందించలేదన్నారు. ఈ నెల 10న ఏపీవో గ్రామానికి వచ్చి కూలీలను విచారించి ఫిర్యాదును వెనక్కి తీసుకుంటేనే వేతనాలు అందజేస్తామని చెప్పడంతో కూలీలు అంగీకరించలేదని, అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కూలీలు డిమాండ్ చేశారన్నారు.

జోన్ డైరీ

● వినుకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 22 తేదీ నుంచి 25వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవం కోల్పోతున్న ప్రభుత్వ పాఠశాలలు

● విద్యార్థుల్లేక ఏకోపాధ్యాయ స్కూళ్లుగా మార్పు ● పలు గ్రామాల్లో ఇదే దుస్థితి



రామకృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల

వినుకొండ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆ స్కూల్‌లో పరిశుభ్రపరిచే కార్మికురాలే ఆ పాఠశాలకు ఛైర్మన్. ఉన్నది నలుగురు విద్యార్థులే. హాజరు చూస్తే 10 మంది. ఇదీ నరగాయపాలెం పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ప్రభుత్వ పాఠశాల పరిస్థితి. 1988 జూలై 17న అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మన్ రాయపాటి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి మాలపాటి వెంకటేశ్వరెడ్డి హయాంలో పాఠశాలను నిర్మించారు. పాఠశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి 2014 టీడీపీ ప్రభుత్వ హయాం వరకు ఆ పాఠశాలకు పిల్లల కొదవలేదు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు నేడు ఇంజనీర్లుతోపాటు, పలు రంగాల్లో రాణించి ప్రయోజకులయ్యారు. నేడు పాఠశాలలో పిల్లలు లేకపోవడంతో బోసిపోతోంది. గత కొన్నేళ్లుగా పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న మేగం చిన్న అంకమ్మ ఇటీవల జరిగిన పాఠశాల మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. జి.నాగలక్ష్మిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. వీరి ఇద్దరి పిల్లలతోపాటు, మరో ఇద్దరు



రామకృష్ణాపురం పాఠశాలలో ఉన్న ఇద్దరు విద్యార్థులు

కలిపి మొత్తం నలుగురు పాఠశాలలో చదువుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పాఠశాల్లో చదువుతున్న పిల్లలకు, అదే గ్రామానికి చెందిన రమాదేవి మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులుగా పనిచేస్తున్నారు. పిల్లలకు వండిపెట్టినా గిట్టుబాటు కావడంలేదని ఆమె తెలిపారు. పాఠశాల భవనం పాతది కావడంతో వర్షానికి తడిచి పైకప్పు పెచ్చులూడి కిందపడే ప్రమాదం ఉండడంతో పాఠశాల ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో వినుకొండ మండలంలో హసన్నాయునిపాలెం, పాతగోకనకొండ, గణేష్‌పాలెం, చోటపాలెం (రామలింగాపురం) విద్యార్థులేక పాఠశాల మనుగడ కోల్పోతున్నాయి. శావల్యాపురం మండలంలో కనమర్లపూడి హరిజన పాఠశాల, కొత్తలూరు, వెలమవారిపాలెం, వేల్పూరు. గుంటుపాలెం, ముంద్రువారిపాలెం, నూజండ్ల మండలంలో పాత, కొత్త పాలెం, పాత జెడ్డవారిపాలెం, యోగిరెడ్డిపల్లి, కొత్త చెరుకుంపాలెం, కొత్తరెడ్డిపాలెం, గాంధీనగర్, బొల్లాపల్లి మండలంలో లాలీపురంతండా, గాంధీనగర్, చెంకకుంట తండా, వీఆర్‌కే తండా, పలుకూరు తండా, మూడు తూముల తండాల్లో పాఠశాలల్లో పిల్లలు లేక ఏకోపాధ్యాయ పాఠశాలలుగా కొనసాగుతున్నాయి.



చోటపాలెం (రామలింగాపురం) పాఠశాల్లోని విద్యార్థులు

డీలర్లపై ఫిర్యాదులు వస్తే సస్పెన్షన్ వేటు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



ప్రజా దర్బార్‌లో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బియ్యానికి బదులు డబ్బులు ఇస్తున్నారని రేషన్ డీలర్లపై ఫిర్యాదు వస్తే ఆ డీలర్‌ను సస్పెండ్ చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నాదెండ్ల గ్రామంలో రూ.50లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్‌లో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలకు సంబంధించి అర్జీలను పుల్లారావు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన సర్వేలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించానన్నారు. దళారీలతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి నష్టమైనా ఉచితంగా ఇసుక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారన్నారు. ఎన్ని టన్నులు ఇసుకైనా లారీల ద్వారా లబ్ధిదారులకు చేర్చవచ్చన్నారు. ఆర్థిక స్తోమత లేని వారికి ఆరోగ్యం కింద ఖర్చుపెడితే ఆ మొత్తంలో 50శాతం వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందిస్తున్నారన్నారు. మద్యం దుకాణాలను నిబంధనల ప్రకారమే నిర్వహించాలని సూచించారు. ప్రతి విషయానికి ఎమ్మెల్యే పేరు చెప్పి చెడ్డ పేరు తేవటం కొంతమందికి అలవాటుగా మారిందన్నారు. అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తేకుండా సమన్వయంగా ప్రతిఒక్కరు పనిచేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తలతోటి రాణి, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, జనసేన నేత తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు సదాశివరావు, షేక్ కరిముల్లా, బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, వేములపల్లి వెంకటేశ్వర్లు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి

● పాఠశాల వార్షికోత్సవంలో నడికట్టు రామిరెడ్డి



నడికట్టు రామిరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఉపాధ్యాయులు

నాదెండ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవ చేయటం ద్వారానే సంతృప్తి లభిస్తుందని గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాల, కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డిల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంతో పాటు రామిరెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన సభలో రామిరెడ్డి విద్యార్థులను, గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జన్మనిచ్చిన చిరుమామిళ్ళ గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులు వ్యయం చేసి ఉన్నత పాఠశాలను నిర్మించానన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పల్నాడు జిల్లాలోనే పాఠశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. వెనుకబడిన గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు తనవంతు కృషి చేశానని వివరించారు. చదువు మంచి భవిష్యత్‌ను, దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించి చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాలలతో పాటు మోడల్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు సుందరరావు, షేక్ కరిముల్లా, ప్రిన్సిపాల్ రూస్సీవాణిల ఆధ్వర్యంలో జన్మదిన కేక్‌లను కట్ చేశారు. పలువురు ప్రముఖులు, వ్యాపార వేత్తలు, దేవాలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైయినేజీ ఆక్రమణలతో నీట మునిగిన రామాలయం

గంటవారిపాలెం (శావల్యాపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని గంటవారిపాలెంలోని మెయిన్ బజారులో రోడ్డుకి ఇరువైపులా డ్రైయినేజీలు ఆక్రమణలకు గురవ్వడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు వెలుపలికి వెళ్లే అవకాశం లేక సెంటర్‌లోని రామాలయం నీట మునిగింది. గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి వేల్పూరుకు వెళ్లే మార్గంలో గత పదేళ్లగా డ్రైయినేజీ పూడిక తీయకపోవడంతో పాటు గ్రామస్థులు ఇళ్ల ముందున్న డ్రైయినేజీలు ఆక్రమించి బండలు వేయడం, ప్రహరీ గోడలు కట్టుకోవడంతో డ్రైయినేజీ వ్యవస్థ పూర్తిగా మూతబడింది. ఇటీవల వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో మెయిన్ బజారుకు పక్కనే ఉన్న తాగునీటి చెరువు నిండి అదనపు నీరు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఏర్పడడంతో గ్రామస్తులు ముందు జాగ్రత్తగా పైపులు వేసి కొంతమేర అడ్డుకున్నారు. ఆదివారం మళ్లీ వర్షం కురవడంతో వర్షపునీరు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఇళ్లతోపాటు రామాలయంలోకి వచ్చి నిలిచిపోయాయి. గతంలో ఎక్కువ వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు మెయిన్ బజారు నుంచే ప్రవహించేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో మెయిన్‌రోడ్డు మెరకలేపి సిమెంట్ రోడ్డు వేయడంతో వర్షపు నీరు వెళ్లే తావులేక ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. జల్‌జీవన్‌మిషన్ ద్వారా లక్షలు ఖర్చుచేసి ఇంటింటికీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేశారేతప్ప తాగునీటి చెరువును బాగు చేయకపోవడంతో ప్రజలకు తాగునీరు సరఫరా చేసిన దాఖలాలే లేవు. దాంతో లక్షల కొద్దీ ప్రజాధనం వృథా అయింది. వర్షం కురిసిన ప్రతిసారీ తాగునీటి చెరువు పొర్లి నీరు గ్రామంలోకి వస్తుందేమోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెయిన్ బజారులోని డ్రైయినేజీ ఆక్రమణలను తొలగించి వర్షపు నీరుకు ఆటంకం లేకుండా గ్రామం వెలుపలికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గంటవారిపాలెంలో నీట మునిగిన రామాలయం, ధ్వజస్తంభం చుట్టూ నిలిచిన వర్షపునీరు



ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ సునీత

జిల్లా జట్టుకు గుడ్‌షెఫర్డ్ విద్యార్థుల ఎంపిక

వినుకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న గుంటూరులోని టీజేపీఎస్ కళాశాల్లో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-18 కేటగిరీ పోటీల్లో పట్టణంలోని గుడ్‌షెఫర్డ్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.లక్ష్మీసునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖోఖో జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో విష్ణువర్ధన్, రాకేష్, మణికంఠ ఉన్నారు. అండర్ -14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో మోహన్ గోపి, రాకేష్, రామకోటేశ్వరరావు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కమల్ కుమార్, కారంపూడిలో జరిగిన అండర్ -14 ఖోఖో పోటీల్లో అజేయ నాయక్, నాగవేణి, సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగంలో అమీర్‌సాయి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ అకాడమి వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో పల్నాడులోనే మొదటిసారిగా ఇండియన్ డ్రోన్ అకాడమీ డ్రోన్ వర్క్‌షాప్ నిర్వహించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ డ్రోన్ అకాడమీ ఎండీ కే వంశీకృష్ణ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో డ్రోన్‌ల ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. సాంకేతిక రంగంలోనే కాకుండా వ్యవసాయరంగంలో కూడా డ్రోన్‌లు ఉపయోగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఈవో ఆర్ శ్రీదేవ్, కళాశాల కరస్పాండెంట్ షేక్ కరీమ్‌మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమ తదితరులు ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ డ్రోన్ అకాడమీ ప్రతినిధులు సందీప్ శ్రీనివాస్, రామకృష్ణ, శివలోకం, విద్యార్థులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి: యూటీఎఫ్

వినుకొండ టౌన్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) రానున్న శాసన మండలి ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గం యూటీఎఫ్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చరిత్రలో పీడీఎఫ్ ఎమ్మెల్సీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా పీడీఎఫ్ అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని కోరారు.



బాలికలను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శావల్యాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది బాలికలు బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి సోమవారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 20న గుంటూరులోని ఎన్‌జీవో హోమ్స్ గ్రౌండ్స్‌లో జరిగిన సీనియర్ మహిళల బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో పాఠశాల్లోని సీనియర్ ఇంటర్ బాలికలు సమీర, కావ్య, జూనియర్ ఇంటర్ బాలికలు లూధియా, దివ్య, దేవమణి, స్రవంతి, 10వ తరగతి బాలిక రత్నకీర్తన, పూర్వ విద్యార్థినులు లిఖిత, బసవరాణి రాణించి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబరు 8 నుంచి 10 వరకు నంద్యాలలో జరగనున్న 9వ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో తొమ్మిది మంది బాలికలు పాల్గొంటారన్నారు. బాలికలను, వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిలను పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, భువనేశ్వరి, విమలకుమారి, కవిత, కిరణ్మయి, నిర్మల, రవికుమార్, శ్రీనివాసరావు, సురేష్, శ్రీకృష్ణ, అబ్దుల్లా తదితరులు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రభుత్వ పనులకు ఇసుక సరఫరా చేస్తాం

● కలెక్టర్ అరుణ్‌బాబు

ఎఫెక్ట్

నరసరావుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రగతి పనులకు ఇసుక సరఫరా చేస్తామని కలెక్టర్ పీ అరుణ్‌బాబు తెలిపారు. వచ్చేవారం నుంచి ప్రభుత్వ శాఖల పరిధిలో నిర్మాణాలకు ఇసుకను రిజర్వ్‌చేసి నిరాటంకంగా పంపిణీ చేస్తామన్నారు. పల్లె ప్రగతికి ఇసుక గండం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త వెలువడిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆఫ్ లైన్, ఆన్ లైన్ రెండు విధానాల ద్వారా ఇసుక పంపిణీ పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజూ వారీ కోటాలో 50శాతం ఇసుక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా, మరో 50శాతం రీచుల వద్ద ఆఫ్‌లైన్ బుకింగ్ ద్వారా పంపిణీ చేస్తారన్నారు. ఇసుక పంపిణీ.. డెలివరీ ఆడిట్ చేయాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్లు, రీచ్‌లతో పాటు అక్రమ తరలింపునకు అవకాశం ఉన్న రూట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచాలన్నారు. ప్రజా ఫిర్యాదులకు నిబంధనల మేర నిర్ణీత గడువులోపు పరిష్కారాలు చూపాలన్నారు. ఫిర్యాదులను మండలాల వారీగా క్రోడీకరించి వ్యక్తిగతంగా జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీఎల్డీవోలు పరిష్కరించాలన్నారు. వచ్చే వారంనుంచి ప్రతి రెండు వారాలకోసారి జిల్లా అధికార యంత్రాంగంతో నియోజకవర్గాల వారీగా ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. నేటి నుంచి నాలుగు రోజుల పాటూ జిల్లా వ్యాప్తంగా ఆధార్ నమోదు కోసం స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఆధార్ నమోదు క్యాంపులలో అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. రబీ సీజన్ ప్రారంభం అయినందున ఎరువులు, పురుగు మందుల కొరత రాకుండా చూడాలన్నారు. తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ ఎరువుల షాపులను తనిఖీ చేసి నకిలీ ఎరువులు, అధిక ధరలకు ఎరువులు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో వినాయకం, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, సీపీవో జి.శ్రీనివాస్, జిల్లా మైన్స్ జియాలజీ అధికారి నాగయ్య, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి, డీఎంహెచ్‌వో రవి, డీఎల్డీవోలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి: కలెక్టర్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన 105 మంది అర్జీదారులు వినుతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి కే వినాయకం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణ పోస్టర్ ఆవిష్కరణ

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న జరగబోయే జిల్లా సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్, పాంప్లేట్స్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలోని బీఆర్ అంబేద్కర్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం 301 రైతు సేవా కేంద్రాలలో జరుగుతుందని, మండలస్థాయి ప్రత్యేక అధికారులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ వరిసాగు పొలాల్లో ఎలుకల ద్వారా 10 నుంచి 40శాతం దిగుబడి తగ్గుతుందని, దీనిని నివారించేందుకు జిల్లాలోని సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఎలుకల నివారణకు వినియోగించే బ్రోమెడయోలిన్ కెమికల్ 100శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా ఇబ్బందుల్లో ఉన్న పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయమందించాన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం తన నివాసంలో నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. యడ్లపాడు మండలం గుత్తావారిపాలెం గ్రామానికి చెందిన కోమటి ధనలక్ష్మి రూ.75వేలు, కారుచోల గ్రామానికి చెందిన గొట్టం జ్యోతికి రూ.25వేలు, మైదవోలు గ్రామానికి చెందిన కటికల మనస్వికి రూ.30వేలు, యడ్లపాడు గ్రామానికి చెందిన ముత్తవరపు అంజయ్యకు రూ.87,237, చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన బొప్పూడి పద్మకు రూ.27,020, ఉప్పలపాటి వెంకాయమ్మకు రూ.1.25 లక్షలు, పట్టణానికి చెందిన తియ్యగూర చిన్నమ్మాయికి రూ.79,265, వెంకటసుబ్బమ్మకు రూ.25వేలు చెక్కులను అందించారు.



తిమ్మాపురం ఎస్సీ కాలనీ వాసులకు నిత్యావసరాలు అందజేస్తున్న అసిస్ట్ డైరెక్టర్ కృష్ణ హరీష్, గ్రామ సర్పంచ్ ప్రభావతి

వెయ్యి కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

తిమ్మాపురం (యడ్లపాడు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో ఫీడ్ ఇండియా, మై టు ఫండ్ సంస్థల సహకారంతో మండలంలోని తిమ్మాపురంలోని పేదలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామంలోని రెండు ఎస్సీ కాలనీలకు చెందిన సుమారు వెయ్యి కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, నూనె, బిస్కెట్లు, గోధుమపిండితో కూడిన కిట్లను గ్రామసర్పంచ్ ప్రభావతి, అసిస్ట్ డైరెక్టర్ కృష్ణ హరీష్‌లు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు డేవిడ్, వెంకయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌లైన్ రింగ్స్ పోటీలకు వంశీదేవాన్ష్ ఎంపిక

కనమర్లపూడి (శావల్యాపురం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఇన్‌లైన్ రింగ్స్ పోటీల్లో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన యూకేజీ విద్యార్థి ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి ఇన్‌లైన్ రింగ్స్ పోటీల్లో యూకేజీ విద్యార్థి భవనాసి వంశీదేవాన్ష్ ప్రతిభను కనబరచి రెండు బంగారు పతకాలను సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఒంటేరు నాగసురేష్ సోమవారం తెలిపారు. ప్రకాశం జిల్లా అద్దంకిలోని ఈనెల 20న జరిగిన జిల్లా స్థాయి ఇన్‌లైన్ రింగ్స్ పోటీల్లో అండర్-7 విభాగంలో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ 6న కాకినాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్, 62వ నేషనల్ సెలక్షన్స్‌లో వంశీ దేవాన్ష్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు.